

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 29.06.2026 | సంపుటి: 3 | సంచిక: 147 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | MONDAY | 29.06.2026 | VOLUME : 3 | ISSUE : 147 | PAGES: 8 | COST: 2/- |



విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


## ఊరేగింపులో భారీ కుట్ర భగ్నం



- 15,000 మందిని చంపేందుకు యత్నం!
- 14,900 విషపూరిత క్యాప్సూల్స్ స్వాధీనం.. నిందితుడి అరెస్ట్
- సకాలంలో అప్రమత్తమైన పోలీసులు..

4

## కువైట్, బహ్రెయిన్‌పై ఇరాన్ ప్రతిదాడులు



- అమెరికా స్థావరాలే లక్ష్యం.. క్షిపణులు, డ్రోన్లతో దాడులు

4

## మోదీకి మరో అంతర్జాతీయ గౌరవం



- సీషెల్స్ అత్యున్నత పర్యావరణ అవార్డు ప్రదానం!

4




# మూసీ ప్రక్షాళన.. నా కల

### ఎన్ని అడ్డంకులు సృష్టించినా పూర్తి చేసి తీరుతాం

వచ్చే ఎన్నికల నాటికి నూటికి ఎస్ఎల్ బీసీ పూర్తి



- రాష్ట్రవ్యాప్తంగా 6,092 కిలోమీటర్ల మేర 441 రహదారుల విస్తరణ
- పదేళ్లలోనే.. వందేళ్ల విధ్వంసం!
- నల్గొండ వేదికగా సంచలన వ్యాఖ్యలు చేసిన రేవంత్ రెడ్డి
- 13,006 కోట్లతో హ్యామ్ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం
- 83 కోట్లతో కార్పొరేషన్ తాగునీటి ప్రాజెక్టుకు శంకుస్థాపన
- పదేళ్ల బీ ఆర్ ఎస్ పాలనపై అసెంబ్లీలో చర్చకు సిద్ధమంటూ సవాల్

వివరాలు 2లో..

ఎలాంటి ఆటంకాలు ఎదురైనా మూసీ నది ప్రక్షాళన పూర్తి చేసి తీరుతానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. దాన్ని దేశానికే తలమానికంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. నల్గొండ జిల్లా పర్యటనలో భాగంగా ఆయన రాష్ట్రవ్యాప్తంగా 13,006 కోట్లతో చేపట్టనున్న హ్యామ్ రోడ్ల నిర్మాణానికి పైలాన్ ఆవిష్కరించారు. ఎన్ జీ కళాశాల మైదానంలో టీ యూ ఎఫ్ ఐ డీ సీ ఆధ్వర్యంలో 83 కోట్లతో చేపట్టనున్న తాగునీటి పథకానికి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన బీ ఆర్ ఎస్ నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రజా పాలనలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పూసగుచ్చినట్లు వివరించారు. అనంతరం ఎన్ జీ కళాశాల మైదానంలో జరిగిన సభలో సీఎం మాట్లాడుతూ.. నల్గొండ జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని, నివేదించిన ప్రతి పనినీ చేయడానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు.

# పోలియోపై పోరు!

### ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరి

5 ఏళ్లలోపు పిల్లలందరికీ వేయించాలి

పోలియో రహిత తెలంగాణకు అందరి సహకారం అవసరం

బోరబండలో పల్స్ పోలియో ప్రారంభించిన మంత్రులు




2

## ముఖ్యమంత్రి సభకు పక్కా ఏర్పాట్లు!



- చింతకాని మండలం జగన్నాథపురంలో సభా ప్రాంగణ పరిశీలన
- అదుగడుగునా ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రి తుమ్మల
- మరో రెండు రోజులు వర్ష సూచనలతో ప్రత్యామ్నాయ చర్యలు
- సభలో నీరు నిలవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి
- మంత్రి వెంట కలెక్టర్ దివాకర, సీపీ సునీల్ దత్, ఎమ్మెల్యేలు

ఈ నెల 30 న రైతు ఆశీర్వాద సభకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.

వివరాలు 2లో..

## శ్రీనాథ్ మృతిపై అనుమానాలు!

రాయదుర్గం భూములపై హైకోర్టు ఆదేశం



- ఉన్నత విద్య కోసం లండన్ వెళ్లిన విద్యార్థి మరణం
- ముందు రోజు రాత్రి కుటుంబంతో ఫోన్ లో సంభాషణ
- మరుసటి రోజే గదిలో విగతజీవిగా కనిపించిన వైనం

3

# 2028లో మళ్లీ కేసీఆరే సీఎం!

- కాంగ్రెస్ హామీలన్నీ గాలిలో కలిశాయన్న కేటీఆర్
- వికారాబాద్ బీఆర్ఎస్ సభలో ప్రభుత్వంపై నిప్పులు
- పోలీసుల పక్షపాత వైఖరిపై తీవ్ర హెచ్చరికలు
- స్పీకర్ వ్యాఖ్యలు రాజ్యాంగ పదవికే అవమానం
- కేసులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టీకరణ



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను ఘోరంగా మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ ముందే చెప్పినట్లు "మోసపోతే గోసపడుతాం" అనే పరిస్థితి ప్రస్తుతం రాష్ట్రంలో కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వికారాబాద్ సమావేశంలో కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, 2028 లో కేసీఆరే మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

వివరాలు 2లో..



## ఆర్థిక సంస్కర్తకు ఘన నివాళి!

- దేశ చరిత్రలో పీవీ సేవలు చిరస్మరణీయం
- చిత్రపటానికి పూలమాల వేసిన సీఎం రేవంత్ రెడ్డి
- నివాళులర్పించిన మంత్రులు కోమటిరెడ్డి, అడ్లూరి

వివరాలు 2లో..

## గచ్చిబౌలిలో రగ్బీ సందడి

- అట్టహాసంగా రగ్బీ ప్రీమియర్ లీగ్ ముగింపు వేడుకలు
- ఫైనల్స్ కు ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఎం రేవంత్
- క్రీడాకారుల్లో ఉత్సాహం నింపిన ముఖ్యమంత్రి

వివరాలు 2లో..

## కాషాయ జెండా ఎగరాలి!

- బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి
- ఎస్ఐఆర్ పై విమర్శలు తిప్పికొట్టాలి
- ఎంపీ ఈటల రాజేందర్



3

## పేగు బంధం కట్!

- తెలంగాణ భాషను అవమానిస్తే ఊరుకోం!
- కాంగ్రెస్, బీజేపీ తీరుపై తీవ్ర ఆగ్రహం
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



3

# పోలియోపై పోరు!

**ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరి**
**బోరబండలో పల్స్ పోలియో ప్రారంభించిన మంత్రులు**
**5 ఏళ్లలోపు పిల్లలందరికీ వేయించాలి**
**పోలియో రహిత తెలంగాణకు అందరి సహకారం అవసరం**
**ఆ దిశగా వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ఏర్పాట్లు**




**హైదరాబాద్** : పోలియో రహిత తెలంగాణ లక్ష్య సాధనలో ప్రతి తల్లిదండ్రి భాగస్వామి కావాలని రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి 5 ఏళ్లలోపు వయస్సున్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని వారు కోరారు. జాతీయ పల్స్ పోలియో దినోత్సవం సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని బోరబండ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 5 ఏళ్లలోపు చిన్నారులకు వారు స్వయంగా పోలియో చుక్కలు వేశారు. పోలియో లాంటి ప్రమాదకర వ్యాధిని పూర్తిగా నిర్మూలించడంలో పల్స్ పోలియో కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని మంత్రులు ఈ సందర్భంగా తెలిపారు.

### ప్రజారోగ్యమే ప్రాధాన్యం..

ప్రజారోగ్య పరిరక్షణలో టీకాల ప్రాధాన్యం ఎంతో కీలకమని మంత్రులు పేర్కొన్నారు. ప్రతి చిన్నారి ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఏ చిన్నారి కూడా పోలియో చుక్కలకు దూరం కాకుండా పకడ్బందీగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారితో పాటు రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రకుమార్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వెల్లడించారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# ముఖ్యమంత్రి సభకు పక్కా ఏర్పాట్లు!

**చింతకాని మండలం జగన్నాథపురంలో సభా ప్రాంగణ పరిశీలన**
**అడుగడుగునా ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రి తుమ్మల**
**మరో రెండు రోజులు వర్ష సూచనలతో ప్రత్యామ్నాయ చర్యలు**
**సభలో నీరు నిలవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి**
**మంత్రి వెంట కలెక్టర్ దివాకర, సీపీ సునీల్ దత్, ఎమ్మెల్యేలు**



**ఖమ్మం** : ఈ నెల 30 న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరుకానున్న రైతు ఆశీర్వాద సభకు ఎలాంటి ఆటంకాలు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. వర్షం వచ్చినా కార్యక్రమానికి అంతరాయం కలగకుండా చూడాలని, భారీగా తరలివచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్, జగన్నాథపురం గ్రామంలో ఈ నెల 29 న రైతు మేళా, 30 న రైతు ఆశీర్వాద సభలు జరగనున్నాయి. ఈ సభల ఏర్పాట్లను ఆదివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రధాన వేదిక, రైతులు కూర్చునే ప్రాంతాలు, పార్కింగ్, ట్రాఫిక్, భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. వ్యవసాయ శాఖ ప్రభుత్వ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, డైరెక్టర్ బి. గోపి, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఆయన వెంట ఉన్నారు.

### వానొచ్చినా ఆగకూడదు..

మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో.. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. వర్షం వచ్చినా కార్యక్రమానికి ఏమాత్రం అంతరాయం కలగకుండా పక్కాగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. సభా ప్రాంగణంలో నీరు నిల్వ కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

### రైతుల రద్దీకి తగ్గట్లు ఏర్పాట్లు..

జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ప్రతి ఏర్పాటును సమర్థవంతంగా పూర్తి చేయాలని తుమ్మల స్పష్టం చేశారు. తాగునీరు, వాహనాల రాకపోకలు, రైతుల ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను సక్రమంగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసేందుకు అన్ని శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

# మూసీ ప్రక్షాళన.. నా కల!

- అడ్డంకులు సృష్టించినా పూర్తి చేసి తీరుతాం
- వచ్చే ఎన్నికల నాటికి నూటికి ఎస్ఎల్ బీసీ పూర్తి
- రాష్ట్రవ్యాప్తంగా 441 రహదారుల విస్తరణ
- నల్గొండ వేదికగా రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు



**నల్గొండ** :: ఎలాంటి ఆటంకాలు ఎదురైనా మూసీ నది ప్రక్షాళన పూర్తి చేసి తీరుతానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. దాన్ని దేశానికే తలమానికంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. నల్గొండ జిల్లా పర్యటనలో భాగంగా ఆయన రాష్ట్రవ్యాప్తంగా 13,006 కోట్లతో చేపట్టనున్న హ్యామ్ రోడ్ల నిర్మాణానికి పైలాన్ ఆవిష్కరించారు. ఎన్ జీ కళాశాల మైదానంలో టీ యూ ఎఫ్ ఐ డీ సీ ఆధ్వర్యంలో 83 కోట్లతో చేపట్టనున్న తాగునీటి పథకానికి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన బీ ఆర్ ఎస్ నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రజా పాలనలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పూసగుచ్చినట్లు వివరించారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో హైబ్రీడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) విధానంలో రహదారుల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 13,006 కోట్లతో 6,092 కిలోమీటర్ల మేర 34 ప్యాకేజీల్లో 441 రహదారుల నిర్మాణ పనులకు సంబంధించి నల్గొండ జిల్లా కనగల్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ (ఏ ఎం సీ) ప్రాంగణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాంఛనంగా పైలాన్ ఆవిష్కరించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా నల్గొండ వైద్య కళాశాల నుంచి మేళ్లదుప్పలపల్లి వరకు, చిట్యాల నుంచి భువనగిరి వరకు, దర్వేశిపురం నుంచి డిండి వరకు రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఆ తర్వాత నల్గొండ పట్టణంలో తెలంగాణ పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీ యూ ఎఫ్ ఐ డీ సీ) ఆధ్వర్యంలో 83 కోట్లతో మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తొలిదశ తాగునీటి శుద్ధి కేంద్రం పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

### ఎస్ఎల్‌బీసీ పూర్తి.. మూసీకి విముక్తి

అనంతరం ఎన్ జీ కళాశాల మైదానంలో జరిగిన సభలో సీఎం మాట్లాడుతూ.. నల్గొండ జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని, నివేదించిన ప్రతి పనినీ చేయడానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల నాటికి ఎస్ ఎల్ బీ సీ ప్రాజెక్టును నూటికి నూరు శాతం పూర్తి చేసి నల్గొండ నేలమీద కృష్ణా నది జలాలను పారిస్తానని ప్రకటించారు. డిండి ప్రాజెక్టు పూర్తికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. పదేళ్లు ఎస్ ఎల్ బీ సీ ని పడావ్ పెట్టిన దుర్మార్గులు బీ ఆర్ ఎస్ నేతలేనంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ కాలుష్యం కారణంగా ఇబ్రహీంపట్నం, భువనగిరి, మునుగోడు, నల్గొండ ప్రజల పరిస్థితి దారుణంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ ప్రక్షాళన చేయాలన్నది తన కల అని, ఒట్టేసి చెబుతున్నా ఎవరు అడ్డుకున్నా ప్రక్షాళన చేసి నల్గొండ ప్రజలకు విముక్తి కల్పిస్తానని స్పష్టం చేశారు. కడుపులో విషం పెట్టుకుని కొందరు దీనిని అడ్డుకోవాలని చూస్తున్నారని విమర్శించారు.

### అసలైన త్యాగం వారిదే..

బీ ఆర్ ఎస్ వాళ్ల త్యాగం అంటే ఎలక్షన్, సెలక్షన్, కలెక్షన్ అని రేవంత్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ కోసం 1969 లో మంత్రి పదవిని త్యాగం చేసిన నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని, ఆయన తర్వాత మలిదశ ఉద్యమంలో పదవీ త్యాగం చేసిన ఏకైక వ్యక్తి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాత్రమేనని కొనియాడారు. వందల మంది త్యాగాలు చేస్తే ఆ త్యాగాలను టీ ఆర్ ఎస్ వాళ్లు నిస్సిగ్గుగా తమ ఖాతాలో వేసుకున్నారని ధ్వజమెత్తారు. ఏ పదవులు ఆశించకుండా పెట్రోల్ పోసుకుని ప్రాణార్పణ చేసిన శ్రీకాంతా చారి త్యాగం గొప్పదా, లేక 100 రూపాయల పెట్రోల్ మీద పోసుకున్న అగ్గిపెట్టెరావుది త్యాగమా అంటూ పరోక్షంగా హరీశ్ రావుపై ఘాటు వ్యాఖ్యలు చేశారు.

### ప్రజా పాలనలో సంక్షేమ వెల్లువ..

గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, తమ ప్రభుత్వం రాగానే లక్షలాది కార్డులు జారీ చేశామని సీఎం తెలిపారు. ఏటా 16,000 కోట్లు ఖర్చు చేస్తూ రాష్ట్రంలో 3.28 కోట్ల మందికి 6 కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. ఫామ్ హౌస్ లో కే సీ ఆర్ తింటున్న సన్న బియ్యాన్నే రాష్ట్రంలోని పేదలు కూడా తింటున్నారని, అనుమానం ఉంటే కే టీ ఆర్ తండాలకు వెళ్లి చూసుకోవచ్చని చురకలంటించారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్ల కోసం 5 లక్షలు ఇస్తుంటే బీ ఆర్ ఎస్ నేతలు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. నిరుపేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామన్నారు. రైతుల ఖాతాల్లో 30 నెలల్లో 1.56 లక్షల కోట్లు జమ చేశామని, రికార్డు స్థాయిలో 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని గుర్తుచేశారు.

### విద్య, ఉపాధి, సామాజిక న్యాయం..

వందేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఎస్సీ వర్గీకరణకు తమ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిందని సీఎం వెల్లడించారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా కులగణన చేపట్టామని, 30 నెలల్లో 70,000 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి యువకుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి 12 వ తరగతి వరకు ప్రవేశపెట్టామని, విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ అందిస్తున్నామన్నారు. ఆరుట్లలో తెలంగాణ మోడల్ స్కూల్ ను అద్భుతంగా తీర్చిదిద్దామన్నారు. నాణ్యమైన విద్యను అందించి ప్రభుత్వ బడుల నుంచి వందలాది మందిని అంబేద్కర్లలా తయారు చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. పిల్లల్లో నైపుణ్యాల పెంపు కోసం స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు, ఐ టీ ఐ లను ఏ టీ సీ లుగా మార్పు చేశామని వివరించారు. కే సీ ఆర్ పదేళ్ల పాలనలో తన తొలి మంత్రివర్గంలో ఒక్క మహిళకు కూడా చోటు ఇవ్వలేదని విమర్శించారు. ఇవన్నీ ప్రజా ప్రభుత్వానికి ఉన్న నిబద్ధత అని, ఇవి సాధించిన విజయాలు కాదా అని ప్రజలు ఆలోచన చేయాలని కోరారు. ఈ సందర్భంగా నీలగిరి జిల్లా మహిళా సమాఖ్య (నల్గొండ) ప్రతినిధులకు ముఖ్యమంత్రి చెక్కులను పంపిణీ చేశారు. ఆ తర్వాత స్థానికులను పలకరిస్తూ కరచాలనం చేస్తూ ముందుకు సాగారు.

### అసెంబ్లీలో చర్చకు సిద్ధమా?

పదేళ్ల బీ ఆర్ ఎస్ పాలనపై, 30 నెలల తమ ప్రజా ప్రభుత్వ పాలనపై అసెంబ్లీ వేదికగా చర్చించడానికి సిద్ధంగా ఉన్నట్టు సీఎం రేవంత్ రెడ్డి సంచలన సవాలు విసిరారు. అవసరమైతే స్పీకర్ కు లేఖ రాసి మేనిఫెస్టోలపై అడిగినన్ని రోజులు చర్చిద్దామన్నారు. కే సీ ఆర్ కుటుంబం పదేళ్లలో వందేళ్ల విధ్వంసం సృష్టించిందని మండిపడ్డారు. బీ ఆర్ ఎస్ కు గతమే కానీ భవిష్యత్తు లేదని, ఆ పార్టీకి ఉప్పుపాతర వేశామని, మళ్లీ ఆ పార్టీ మొక్క కూడా మొలవనీయబోమని ప్రజలే అంటున్నారని ఎద్దేవా చేశారు. కల్వకుంట్ల కుటుంబ అవినీతిని చూసే ప్రజలు వారిని శాశ్వతంగా బహిష్కరించారని, మళ్లీ వారికి పదవులు ఇచ్చేందుకు సిద్ధంగా లేరని స్పష్టం చేశారు. సూర్యాపేటలో ఉన్న ఒక జానెడు వ్యక్తిని వచ్చే ఎన్నికల్లో గెలవనియ్యబోమని పరోక్షంగా జగదీశ్ రెడ్డికి ఛాలెంజ్ చేశారు. కేటీఆర్, హరీశ్ రావు తోడేళ్లలా రాష్ట్రంలో తిరుగుతున్నారని ఫైర్ అయ్యారు.

# ఆర్థిక సంస్కర్తకు ఘన నివాళి!

- దేశ చరిత్రలో పీవీ సేవలు చిరస్మరణీయం
- చిత్రపటానికి పూలమాల వేసిన సీఎం రేవంత్ రెడ్డి
- నివాళులర్పించిన మంత్రులు కోమటిరెడ్డి, అడ్లూరి

**హైదరాబాద్** :: మాజీ ప్రధానమంత్రి, భారతరత్న పాములపర్తి వెంకట నరసింహారావు దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. పీవీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ ఆర్థిక సంస్కరణలకు పునాది వేసిన దార్శనిక నాయకుడిగా, సమర్థవంతమైన పరిపాలకుడిగా పీవీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని ముఖ్యమంత్రి ప్రశంసించారు. పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ముఖ్యమంత్రితో పాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.



ఆ మహానేత రాజకీయ, పరిపాలనా సేవలను ఈ సందర్భంగా నేతలు స్మరించుకున్నారు.

### తెలుగు జాతికి గర్వకారణం..

తెలంగాణ గడ్డపై జన్మించి దేశ ప్రధానమంత్రి పదవిని అధిరోహించిన పీవీ నరసింహారావు ప్రతి తెలుగు వాడికి గర్వకారణమని మంత్రులు పేర్కొన్నారు. ఆయన దూరదృష్టి, నాయకత్వ పటిమ దేశాభివృద్ధికి కొత్త దిశను చూపాయని చెప్పారు. కష్టకాలంలో ఆర్థిక రంగంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు భారత ప్రగతికి బలమైన పునాది వేశాయని ప్రశంసించారు.

### ఆశయ సాధనకు కృషి చేయాలి..

పీవీ నరసింహారావు సాహిత్యం, రాజకీయాలు, పరిపాలనా రంగాల్లో చేసిన విశేష సేవలు భావితరాలకు ఎంతగానో స్ఫూర్తినిస్తాయని నాయకులు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొని పీవీకి ఘనంగా నివాళులర్పించారు.

# గచ్చిబౌలిలో రగ్బీ సందడి

- అట్టహాసంగా రగ్బీ ప్రీమియర్ లీగ్ ముగింపు వేడుకలు
- ఫైనల్స్ కు ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఎం రేవంత్
- క్రీడాకారుల్లో ఉత్సాహం నింపిన ముఖ్యమంత్రి

**హైదరాబాద్** :: హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన రగ్బీ ప్రీమియర్ లీగ్ ఫైనల్స్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అట్టహాసంగా జరిగిన ఈ ముగింపు వేడుకల్లో ఆయన ప్రత్యక్షంగా పాల్గొని క్రీడాకారుల్లో సరికొత్త ఉత్సాహం నింపారు. గచ్చిబౌలి స్టేడియం వేదికగా రగ్బీ ప్రీమియర్ లీగ్ ఫైనల్స్ అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఈ క్రీడా సంగ్రామానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ టోర్నీలో ఫైనల్స్ కు చేరిన జట్ల మధ్య జరిగిన పోరు క్రీడాభిమానులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ రగ్బీ ప్రీమియర్ లీగ్ ముగింపు కార్యక్రమాల్లో ముఖ్యమంత్రితో పాటు పలువురు ప్రముఖులు పాలుపంచుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, సార్గ్ చైర్మన్ శివసేనా రెడ్డి తదితరులు ఫైనల్ మ్యాచ్ ను వీక్షించారు. రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం చేస్తున్న కృషికి ఇలాంటి లీగ్ లు మరింత ఊతం ఇస్తాయని క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# 2028లో మళ్లీ కేసీఆరే సీఎం!

- కాంగ్రెస్ హామీలన్నీ గాలిలో కలిశాయన్న కేటీఆర్
- వికారాబాద్ బీఆర్ఎస్ సభలో ప్రభుత్వంపై నిప్పులు
- పోలీసుల పక్షపాత వైఖరిపై తీవ్ర హెచ్చరికలు
- స్పీకర్ వ్యాఖ్యలు రాజ్యాంగ పదవికే అవమానం
- కేసులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టీకరణ



**వికారాబాద్ ::** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను ఘోరంగా మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ ముందే చెప్పినట్లు "మోసపోతే గోసపడుతాం" అనే పరిస్థితి ప్రస్తుతం రాష్ట్రంలో కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వికారాబాద్ లో జరిగిన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, 2028 లో కేసీఆరే మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తనకు తీవ్రమైన జ్వరం ఉన్నప్పటికీ కార్యకర్తలను కలిసేందుకే వికారాబాద్ కు వచ్చానని కేటీఆర్ తెలిపారు. ఈ ప్రాంతంలోని స్వచ్ఛమైన గాలి, ప్రకృతి తన ఆరోగ్యానికి ఎంతో మేలు చేశాయన్నారు. వికారాబాద్ ను భవిష్యత్తులో ప్రముఖ పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేసేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

### ఆ నిధులతోనే సంక్షేమ పథకాలు..

శాసనసభ స్పీకర్ కేసీఆర్ ప్రభుత్వ అప్పులపై చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగబద్ధమైన పదవికి తగవని కేటీఆర్ తప్పుబట్టారు. కేంద్ర ప్రభుత్వమే పార్లమెంట్‌లో అప్పుల వివరాలను వెల్లడించిందని గుర్తుచేశారు. ఆ నిధులతోనే కాళేశ్వరం ప్రాజెక్టు, వైద్య కళాశాలలు, గురుకులాలు, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, పెంచిన పింఛన్లు లాంటి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశామని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ కోతలు, యూరియా కొరత లాంటి సమస్యలు మళ్లీ మొదలయ్యాయని ఆరోపించారు.

### హామీల అమలుపై నిలదీత..

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలు, రైతు రుణమాఫీ, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలు ఇప్పటికీ పూర్తిగా అమలు కాలేదని కేటీఆర్ విమర్శించారు. ప్రజలు ఈ ప్రభుత్వ పనితీరును నిశితంగా గమనిస్తున్నారని, కాంగ్రెస్ పై రోజురోజుకూ వ్యతిరేకత పెరుగుతోందన్నారు. తమ పార్టీ నాయకులపై నమోదవుతున్న అక్రమ కేసులకు భయపడబోమని, ఇలాంటి కేసుల వల్ల తమ నాయకులు మరింత బలంగా ఎదుగుతారని స్పష్టం చేశారు.

### పోలీసులకు గట్టి హెచ్చరిక..

పోలీసు అధికారులు చట్టబద్ధంగా వ్యవహరించాలని, అధికార పార్టీకి అనుకూలంగా మారొద్దని కేటీఆర్ హెచ్చరించారు. భవిష్యత్తులో రాష్ట్రంలో అధికార మార్పు జరగడం ఖాయమని, అప్పుడు అధికార దుర్వినియోగానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. దామగుండం అడవుల పరిరక్షణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పర్యావరణానికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చిందని, కానీ ప్రస్తుత ప్రభుత్వం వేల ఎకరాల అటవీ భూమిని కేంద్రానికి అప్పగించిందని ఆరోపించారు. ᒧᑎ లమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని కాంగ్రెస్ పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. పార్టీ ఫిరాయింపుల అంశంపై స్పీకర్ స్పందించడం లేదని ఆరోపిస్తూ, బీఆర్ఎస్ పోరాటం నిరంతరం కొనసాగుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# కాషాయ జెండా ఎగరాలి!

- దొంగ ఓట్ల తొలగింపునకే ఓటర్ల జాబితా సవరణ
- గతంలో తప్పు చేసిన వారికే ఇప్పుడు భయం
- బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి
- ఎస్ఐఆర్ పై కాంగ్రెస్, మజ్లిస్ విమర్శలు తిప్పికొట్టాలి
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



**హైదరాబాద్ :** తెలంగాణలో ప్రతి బూత్ స్థాయిలో బీజేపీని బలోపేతం చేసి రానున్న ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో నిర్వహించిన బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనంలో ఆయన ముఖ్య వక్తగా మాట్లాడారు. ఓటర్ల జాబితా సవరణపై కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలు చేస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా తిప్పికొట్టారు. రాష్ట్రంలో బీజేపీ బలం రోజురోజుకూ పెరుగుతోందని ఈటల రాజేందర్ అన్నారు. తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ఆ మార్పుకు బీజేపీయే ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని పేర్కొన్నారు. గతంలో గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో బీజేపీ 48 డివిజన్లలో విజయం సాధించిందని గుర్తుచేశారు. జీహెచ్ఎంసీ పరిధిలోని 5 లోక్‌సభ స్థానాల్లో 4 స్థానాలను గెలుచుకున్నామని, అదే విజయాన్ని రానున్న ఎన్నికల్లోనూ పునరావృతం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

### విమర్శలు నిరాధారం..

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ ఐ ఆర్) పై కాంగ్రెస్, మజ్లిస్ చేస్తున్న విమర్శలను ఈటల ఖండించారు. దొంగ ఓట్లను తొలగించి ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా మార్చడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని చెప్పారు. బీఎల్వోలు ప్రభుత్వ అధికారులని, అలాంటప్పుడు బీజేపీ ఓట్లను తొలగిస్తోందని ఆరోపించడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు. గతంలో అక్రమ ఓట్లతో లబ్ధి పొందిన వారికే ఇప్పుడు భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు.

### పేదల ఇళ్ల కూల్చివేతలపై మండిపాటు..

కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపైనా ఈటల తీవ్ర విమర్శలు చేశారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇళ్లను కూల్చివేస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం వారినే ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. బీఆర్ఎస్ పాలనను చూసిన ప్రజలు ఇప్పుడు కాంగ్రెస్ పాలన పట్ల కూడా అసంతృప్తితో ఉన్నారని, అందుకే బీజేపీకి అవకాశం ఇవ్వాలని నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు.

### తెలంగాణలో కాషాయ జెండా..

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో పారదర్శక పాలన, రాజ్యాంగ విలువల పరిరక్షణకు ప్రాధాన్య ఇస్తున్నామని ఈటల రాజేందర్ అన్నారు. ప్రతి పౌరుడి ఓటు హక్కు సక్రమంగా వినియోగించేలా ఎన్నికల వ్యవస్థను బలోపేతం చేయడమే బీజేపీ లక్ష్యమని తెలిపారు. బెంగాల్‌లో ప్రజలు అవినీతి పాలనకు గుణపాఠం చెప్పినట్లే తెలంగాణలోనూ తగిన తీర్పు ఇస్తారని విశ్వాసముంచారు. రానున్న రోజుల్లో తెలంగాణలో కాషాయ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ పాల్గొన్నారు. వీరితో పాటు బీజేపీ జాతీయ కార్యదర్శి సునీల్ బన్సల్, రాష్ట్ర ఇన్‌ఛార్జ్ అభయ్ పాటిల్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, ఎంపీలు, ఎమ్మెల్సీలు, పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# బీఆర్ఎస్‌తో పేగు బంధం కట్

- తెలంగాణ భాషను అవమానిస్తే ఊరుకోం!
- ఉద్యమకారులకు ఇచ్చిన 250 గజాల స్థలం కోసం పోరాటం
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత
- ఉప్పల్ లో తెలంగాణ రక్షణ సేన జెండా ఆవిష్కరణ
- కాంగ్రెస్, బీజేపీ తీరుపై తీవ్ర ఆగ్రహం



**హైదరాబాద్ :** తెలంగాణ అస్తిత్వంపై దాడులు జరుగుతున్నా బీ ఆర్ ఎస్ స్పందించకపోవడం చూస్తుంటే.. ఆ పార్టీకి తెలంగాణతో ఉన్న పేగు బంధం పూర్తిగా తెగిపోయిందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఉద్యమాన్ని అడ్డుకున్న శక్తులకు బీ ఆర్ ఎస్ లోని ఓ గుంటనక్క ప్రోత్సాహం ఇస్తోందని తీవ్ర ఆరోపణలు చేశారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీ సాధన కోసం జూలై 2 న భారీ భూపోరాటం చేస్తామని ఆమె ప్రకటించారు. ఆదివారం ఉప్పల్ పిస్తా హౌస్ చౌరస్తాలో తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండాను కవిత ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో వ్యతిరేకంగా మాట్లాడిన వారే ఇప్పుడు తెలంగాణ అస్తిత్వంపై కుట్రలు చేస్తున్నారని, ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

### గుంటనక్క ప్రోత్సాహంతోనే..

కార్పొరేట్ విద్యాసంస్థలు, ఇతర సంస్థలకు ప్రోత్సాహం అందిస్తున్నది బీ ఆర్ ఎస్ లోని గుంటనక్కేనని కవిత ఆరోపించారు. అందుకే తెలంగాణపై అవమానకర వ్యాఖ్యలు వచ్చినా ఆ పార్టీ మౌనంగా ఉంటోందని విమర్శించారు. మరోవైపు తెలంగాణ అస్తిత్వంపై దాడులు జరుగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడం లేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ ఉద్యమంతో ఎలాంటి సంబంధం లేకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. బీ జే పీ కూడా తెలంగాణ సమస్యలను గాలికొదిలేసిందని విమర్శించారు.

### స్థానికులకే ప్రాధాన్యం ఇవ్వాలి..

రాష్ట్రంలోని ప్రభుత్వ డెయిరీల నుంచి కార్పొరేట్ ఆసుపత్రులు, విద్యాసంస్థలకు పాల సరఫరా జరిగేలా ప్రభుత్వం తక్షణమే జీవో జారీ చేయాలని కవిత డిమాండ్ చేశారు. ఆయా సంస్థల్లో ఉద్యోగాల నియామకాలు, ఇతర సేవల్లో స్థానికులకు తప్పనిసరిగా ప్రాధాన్యం కల్పించాలని కోరారు. 'ఇడుపు కాగితం' సినిమా పేరు వివాదంపై స్పందించిన కవిత.. ఆ పదానికి అర్థం ఏమిటో పవన్ కల్యాణ్ బాగా చెప్పగలరని చురకలంటించారు. తెలంగాణ భాష, యాసను అవమానించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని హెచ్చరించారు. ప్రతి ప్రాంత భాషను పరస్పరం గౌరవించుకోవాలని సూచించారు.

### జూలై 2 న భగాయత్ లో భూపోరాటం..

తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం హామీ ఇచ్చిన 250 గజాల స్థలం కోసం జూలై 2 న ఉప్పల్ భగాయత్ లో భారీ భూపోరాటం నిర్వహిస్తామని కవిత ప్రకటించారు. ఉద్యమకారులు, విద్యార్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ హక్కులు, అస్తిత్వ పరిరక్షణ కోసం తమ పార్టీ పోరాటం నిరంతరం కొనసాగిస్తుందని ఆమె స్పష్టం చేశారు.

# శ్రీనాథ్ మృతిపై అనుమానాలు!

- ఉన్నత విద్య కోసం లండన్ వెళ్లిన విద్యార్థి మరణం
- ముందు రోజు రాత్రి కుటుంబంతో ఫోన్ లో సంభాషణ
- మరుసటి రోజే గదిలో విగతజీవిగా కనిపించిన వైనం
- ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదన్న బంధువులు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆదుకోవాలని వేడుకోలు



**కామారెడ్డి :** ఉన్నత విద్య కోసం లండన్ వెళ్లిన కామారెడ్డి జిల్లా విద్యార్థి శ్రీనాథ్ రెడ్డి అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందాడు. అతడు ఆత్మహత్య చేసుకున్నాడని స్నేహితులు చెబుతున్నా.. కుటుంబ సభ్యులు మాత్రం తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించి అసలు నిజాలు తేల్చాలని, మృతదేహాన్ని స్వదేశానికి రప్పించేందుకు ప్రభుత్వాలు సాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. రాజంపేట మండలం తలమడ్ల గ్రామానికి చెందిన మధుసూధన్ రెడ్డి కుమారుడు శ్రీనాథ్ రెడ్డి సుమారు 14 నెలల క్రితం ఎంఎస్ చదువుకోడానికి లండన్ వెళ్లాడు. ఈ నెల 22 న రాత్రి వరకు కుటుంబ సభ్యులతో ఫోన్ లో మాట్లాడిన శ్రీనాథ్.. మరుసటి రోజు తన గదిలో మృతదేహంగా కనిపించినట్లు స్నేహితులు సమాచారం అందించారు. ఈ వార్త విన్న కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

### ఆత్మహత్య ఎలా చేసుకుంటాడు?

చివరిసారిగా ఫోన్ లో మాట్లాడినప్పుడు శ్రీనాథ్ ఎలాంటి ఆందోళన లేకుండా ఎంతో ఉత్సాహంగా ఉన్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అదే రోజు స్నేహితుడి పుట్టినరోజు వేడుకకు కూడా హాజరైనట్లు చెప్పారు. శ్రీనాథ్ ఆత్మహత్య చేసుకున్నాడని రూమ్ మేట్లు చెబుతున్నప్పటికీ.. కుటుంబ సభ్యులు ఆ వాదనను ఏమాత్రం నమ్మడం లేదు. ముందు రోజు వరకు సాధారణంగా ఉన్న వ్యక్తి ఒక్కసారిగా ఆత్మహత్య చేసుకోవడం అనుమానాలకు తావిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రభుత్వాలు ఆదుకోవాలి..

ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి అసలు నిజాలు వెలుగులోకి తీసుకురావాలని శ్రీనాథ్ కుటుంబం కోరుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకుని విదేశీ అధికారులతో సమన్వయం చేసి పూర్తి స్థాయి విచారణ జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావడానికి ప్రభుత్వమే సహాయం అందించాలని వారు వేడుకుంటున్నారు. ఈ ఘటనతో భారతీయ విద్యార్థుల భద్రతపై విదేశాల్లో మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# హైదరాబాద్ బీజేపీ అడ్డా!

### ఎవరు అడ్డుకున్నా కమల వికాసం ఖాయం!

### కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం కలిసొచ్చినా ఓడించలేవు: రాంచందర్ రావు


**హైదరాబాద్ :** బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ హైదరాబాద్ లో పర్యటించారు. శనివారం సాయంత్రం రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్జీఐఏ) లో ఆయనకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఘన స్వాగతం పలికారు. నాంపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో జరిగిన బూత్ ప్రముఖ్ సమ్మేళనంలో నితిన్ నబీన్ ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యకర్తల్లో సరికొత్త ఉత్సాహం నింపారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ స్థాపనే లక్ష్యంగా శ్రేణులతో ప్రతిజ్ఞ చేయించారు. బీజేపీ జాతీయ కార్యకర్తలకు ఇదొక చారిత్రాత్మక ఘట్టమని నేతలు కొనియాడారు. పర్యటనలో భాగంగా నితిన్ నబీన్ రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయాన్ని నేరుగా ప్రారంభించారు. అదే సమయంలో వర్చువల్ విధానంలో మరో 8 జిల్లాల పార్టీ కార్యాలయాలను ప్రారంభించి సరికొత్త రికార్డు సృష్టించారు. సిద్ధాంతాలు, జాతీయ ప్రయోజనాల కోసం సాగే పోరాటాలకు బీజేపీ కార్యాలయాలే కేంద్ర బిందువులని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు నాంపల్లి ఆఫీస్ లో పనిచేసే డిజైనర్లు, అడ్మిన్ స్టాఫ్, సపోర్ట్ టీమ్ సభ్యులందరినీ పలకరించి వారితో ఆత్మీయంగా ముచ్చటించారు. అనంతరం పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమై ప్రజా సంబంధాల బలోపేతంపై విలువైన మార్గదర్శకత్వం చేశారు.

### ఎవరు కలిసొచ్చినా బీజేపీ గెలుపు ఖాయం..

నాంపల్లి బూత్ ప్రముఖ్ సమ్మేళనంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ.. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం మూడు పార్టీలు కలిసొచ్చినా బీజేపీని ఓడించలేవని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ ఎప్పటికీ బీజేపీ అడ్డానేనని, మూడు కార్పొరేషన్లలో కమలం వికసించడం ఖాయమని స్పష్టం చేశారు. అభివృద్ధిని వదిలేసి కేవలం కమిషన్లకే ప్రాధాన్యం ఇస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ తీరుపై నగర ప్రజలు తీవ్ర విరక్తితో ఉన్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజ్‌గిరి ప్రాంతాలను కేవలం రియల్ ఎస్టేట్ అడ్డాలుగా మార్చేసి ఖజానా నింపుకుంటున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు.

### చిన్న వానకే నగరం జలమయం..

గత బీఆర్ఎస్ పాలనలో ఒక రోజు వాన పడితేనే హైదరాబాద్ సగం మునిగిపోయేదని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో చిన్న వాన పడినా రోడ్లు నదులను తలపిస్తున్నాయని రాంచందర్ రావు విమర్శించారు. వాహనాలు వరదల్లో చిక్కుకుంటున్నాయని, కరెంట్ షాక్ లతో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ధ్వజమెత్తారు. ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా సవరణ) ప్రక్రియపై ప్రతిపక్షాలు కావాలనే అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. పశ్చిమ బెంగాల్ లో ఎస్ఐఆర్ వల్లే బీజేపీ గెలిచిందని అంటున్నారని, మరి కేరళలో కాంగ్రెస్ ఎలా గెలిచిందని ప్రశ్నించారు. ప్రజల మద్దతు ఉంటేనే ఏ పార్టీ అయినా గెలుస్తుందని, బెంగాల్ తరహాలోనే రేపు తెలంగాణలోనూ బీజేపీ గెలవడం ఖాయమని స్పష్టం చేశారు. నరేంద్ర మోదీ నేతృత్వంలోని సుపరిపాలన సందేశాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని, హైదరాబాద్ నిజమైన అభివృద్ధి వైపు అడుగులు వేయాలంటే బీజేపీతోనే సాధ్యమని రాంచందర్ రావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.




# శ్రీవారి సేవలో అనంత్ అంబానీ

## టీటీడీకి రూ.27.5 కోట్లతో 25 ఎలక్ట్రిక్ బస్సుల విరాళం

## ఛార్జింగ్ స్టేషన్లు, 50 మంది డ్రైవర్ల జీతాలు కూడా రిలయన్స్‌దే

## తిరుమల గోశాల ఆధునీకరణకూ సహకారం ప్రకటించిన అనంత్

**తిరుమల, జూన్ 28:** ప్రముఖ పారిశ్రామికవేత్త, రిలయన్స్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ అనంత్ అంబానీ ఆదివారం తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున శ్రీవారి సుప్రభాత సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం టీటీడీకి రూ.27.5 కోట్ల విలువైన 25 ఎలక్ట్రిక్ బస్సులను విరాళంగా అందజేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అనంత్ అంబానీకి వేదాశీర్వచనం అందించగా, టీటీడీ అధికారులు శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం టీటీడీ అధికారులతో సమావేశమైన ఆయన తిరుమలలో జరుగుతున్న సేవా కార్యక్రమాలపై ఆరా తీశారు. తిరుమలలో పర్యావరణహిత రవాణాను ప్రోత్సహించే ఉద్దేశంతో 25 ఎలక్ట్రిక్ బస్సులను అందజేయనున్నట్లు అనంత్ అంబానీ తెలిపారు. బస్సులతో పాటు వాటి నిర్వహణకు అవసరమైన ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు కూడా రిలయన్స్ సంస్థ సహకరిస్తుందని వెల్లడించారు. అంతేకాకుండా ఈ బస్సులను నడిపే 50 మంది డ్రైవర్ల జీతభత్యాలను కూడా రిలయన్స్ సంస్థే భరిస్తుందని ప్రకటించారు. అదనంగా, గుజరాత్‌లోని రిలయన్స్ వంతారా నమూనాలో తిరుమల శ్రీవారి గోశాలను ఆధునీకరించేందుకు కూడా సహకారం అందిస్తామని అనంత్ అంబానీ హామీ ఇచ్చారు. ఈ నిర్ణయాన్ని టీటీడీ అధికారులు స్వాగతిస్తూ, తిరుమలలో గ్రీన్ ట్రాన్స్‌పోర్ట్ వ్యవస్థ బలోపేతానికి ఇది కీలక అడుగని అభిప్రాయపడ్డారు. మరోవైపు వారాంతం కావడంతో తిరుమలలో భక్తుల రద్దీ భారీగా పెరిగింది. టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి సర్వదర్శనానికి సుమారు 24 నుంచి 26 గంటల సమయం పడుతోంది. ఈ నేపథ్యంలో సాధారణ భక్తులకు ప్రాధాన్యం కల్పించేందుకు సోమవారం వీఐపీ బ్రేక్ దర్శనాలు, శ్రీవాణి దర్శనాలను రద్దు చేసినట్లు టీటీడీ ప్రకటించింది.

### రామమందిర నిధుల దుర్వినియోగం కేసులో

# కొత్త కోణం

## నిందితుల ఆస్తులపై సిట్ దృష్టి

## మూడేళ్లలో భారీగా పెరిగిన సంపదపై విచారణ


**అయోధ్య, జూన్ 28:** అయోధ్య రామమందిర నిధుల దుర్వినియోగం కేసు దర్యాప్తులో కొత్త అంశాలు వెలుగుచూస్తున్నాయి. కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుష్ మిశ్రాతో పాటు ఇప్పటికే మొత్తం ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం వారి ఆర్థిక లావాదేవీలు, ఇటీవల సంపాదించిన ఆస్తులపై ప్రత్యేక దర్యాప్తు కొనసాగుతోంది. దర్యాప్తు వివరాల ప్రకారం, రామమందిరానికి వచ్చిన నగదు లెక్కింపు బాధ్యతలు నిర్వహించిన అనుకల్ప్ మిశ్రా తన బంధువు లవ్‌కుష్ మిశ్రాను కూడా అదే బృందంలో చేర్చినట్లు అధికారులు గుర్తించారు. ఈ మొత్తం వ్యవహారంలో అనుకల్ప్ కీలక పాత్ర పోషించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జాతీయ మీడియా కథనాల ప్రకారం, కొంతకాలం క్రితం వరకు సాధారణ ఆర్థిక పరిస్థితిలో ఉన్న అనుకల్ప్ కుటుంబం ఇటీవల విలాసవంతమైన జీవనం గడుపుతున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామంలో భారీ నివాసాన్ని నిర్మించడంతో పాటు ఫార్మ్‌హౌస్ కొనుగోలు చేసినట్లు, ఖరీదైన వాహనాలు కొనుగోలు చేసే స్థాయికి చేరుకున్నట్లు సమాచారం. ఇదే విధంగా లవ్‌కుష్ మిశ్రా కూడా ఇటీవల ఖరీదైన ద్విచక్ర వాహనం కొనుగోలు చేసినట్లు స్థానికులు వెల్లడించారు. అనుకల్ప్ గతంలో బ్యాంకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేసి, మూడేళ్ల క్రితం రామమందిర నిధుల లెక్కింపు బృందంలో చేరినట్లు తెలుస్తోంది. అనంతరం తన బంధువును కూడా అదే బృందంలో చేర్చుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. నిందితుల వ్యక్తిగత ఆస్తులు, బ్యాంకు ఖాతాలు, భూములు, ప్లాట్లు, హోటళ్ల కొనుగోళ్లు, ఇతర పెట్టుబడులపై సిట్ అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. కొందరి ఆస్తుల విలువ గత కొన్నేళ్లలో అసాధారణంగా పెరిగినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు సమాచారం. ఈ కేసులో నిధుల దుర్వినియోగం ఎలా జరిగిందనే అంశంతో పాటు, అక్రమంగా సంపాదించినట్లు అనుమానిస్తున్న ఆస్తుల మూలాలను కూడా సిట్ అధికారులు లోతుగా పరిశీలిస్తున్నారు. దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.





# మొహర్రం ఊరేగింపులో భారీ కుట్ర భగ్నం

- 15,000 మందిని చంపేందుకు యత్నం!
- 14,900 విషపూరిత క్యాప్సూల్స్ స్వాధీనం.. నిందితుడి అరెస్ట్
- పెయిన్‌కిల్లర్ పేరుతో ఎలుకల మందు పంపిణీ యత్నం
- సకాలంలో అప్రమత్తమైన పోలీసులు..
- భారీ ప్రాణనష్టం తప్పింది

**ముంబై, జూన్ 28:** ముంబై మహానగరంలో జరగాల్సిన ఓ పెను విషాదాన్ని పోలీసులు తమ అప్రమత్తతతో నివారించారు. మొహర్రం ఊరేగింపును లక్ష్యంగా చేసుకుని, వేలాది మంది ప్రాణాలు తీసేందుకు పన్నిన భారీ కుట్రను భగ్నం చేశారు. నొప్పి నివారణ (పెయిన్ కిల్లర్) మాత్రల నెపంతో ఎలుకల మందు నింపిన క్యాప్సూల్స్‌ను పంపిణీ చేస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి, దాదాపు 15,000 విషపు క్యాప్సూల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన ముంబైలో తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే, శుక్రవారం రాత్రి ముంబైలోని బైకుల్లా ప్రాంతంలో మొహర్రం ఊరేగింపు ప్రశాంతంగా సాగుతోంది. ఈ క్రమంలో పుణెకు చెందిన ఫయాజ్ ప్రేమ్‌జీ (39) అనే పెయింట్ వ్యాపారి, ఊరేగింపులో పాల్గొంటున్న వారికి కొన్ని క్యాప్సూల్స్ పంపిణీ చేయడం ప్రారంభించాడు. అవి నొప్పి నివారణ మందులని నమ్మబలికాడు. అయితే, అతని ప్రవర్తనపై అనుమానం వచ్చిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా దిగ్భ్రాంతికరమైన నిజాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడు పంపిణీ చేస్తున్నవి సాధారణ మాత్రలు కావని, వాటిలో జింక్ ఫాస్ఫైడ్ అనే తీవ్రమైన విషపూరిత ఎలుకల మందు నింపి ఉందని గుర్తించారు. అతని వద్ద నుంచి సుమారు 14,900 విషపూరిత క్యాప్సూల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితుడు తన క్రూరమైన పథకాన్ని అంగీకరించాడు. "నేను కనీసం 15,000 మందిని చంపాలనుకున్నాను" అని చెప్పినట్లు అధికారులు తెలిపారు. ఈ దారుణం కోసం నిందితుడు గత 15 రోజులుగా ముంబైలోనే ఉంటూ పథక రచన చేసినట్లు తేలింది. ఆన్‌లైన్ ద్వారా 50 కిలోల జింక్ ఫాస్ఫైడ్, 30,000 ఖాళీ క్యాప్సూల్స్‌ను కొనుగోలు చేసి, వాటిలో విషాన్ని నింపినట్లు గుర్తించారు. తెల్లవారుజామున 4 గంటల సమయంలో, నిందితుడు ఇచ్చిన క్యాప్సూల్ తీసుకున్న సల్మాన్ అనే వ్యక్తి వాంతులు, కడుపు నొప్పితో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఈ ఘటనకు, నిందితుడికి మధ్య ఉన్న సంబంధాన్ని గుర్తించి అతడిని అరెస్ట్ చేశారు. పోలీసుల సత్వర స్పందనతో భారీ ప్రాణనష్టం తప్పిందని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ జయంత్ మీనా తెలిపారు. ఈ ఘటనలో స్వల్ప అస్వస్థతకు గురైన మరికొందరికి చికిత్స అందించగా, ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉందని చెప్పారు. బైకుల్లా పోలీసులు ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడికి ఏవైనా ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయా, అతని విదేశీ ప్రయాణాల వివరాలు, ఈ కుట్ర వెనుక ఇంకెవరైనా ఉన్నారా అనే కోణంలో లోతుగా విచారణ జరుపుతున్నారు. మొహర్రం ఊరేగింపుల సందర్భంగా భారీ జనసందోహం ఉంటుందన్న ఉద్దేశంతోనే నిందితుడు ఈ దాడికి ప్రణాళిక రచించినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనతో నగరంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

# కువైట్, బహ్రెయిన్‌పై ఇరాన్ ప్రతిదాడులు

- అమెరికా స్థావరాలే లక్ష్యం.. క్షిపణులు, డ్రోన్లతో దాడులు
- 'మళ్లీ దాడులు చేస్తే ఇరాన్ ఉనికే ఉండదు': ట్రంప్ హెచ్చరిక
- ప్రాంతీయ శాంతి ఒప్పందం సంక్షోభంలో.. యుద్ధ మేఘాలు మరింత కమ్ముకున్న పశ్చిమాసియా




**వాషింగ్టన్/టెహ్రాన్, జూన్ 28:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి తీవ్రరూపం దాల్చాయి. తమ భూభాగంపై అమెరికా జరిపిన వైమానిక దాడులకు ప్రతీకారంగా ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) కువైట్, బహ్రెయిన్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు జరిపినట్లు ప్రకటించింది. దీంతో ఇటీవల కుదిరిన తాత్కాలిక శాంతి ఒప్పందం తీవ్ర సంక్షోభంలో పడింది. ఇరాన్ ప్రకారం, హర్మూజ్ జలసంధి సమీపంలోని తమ క్షిపణి కేంద్రాలు, డ్రోన్ గిడ్డంగులు, రాడార్ వ్యవస్థలపై అమెరికా జరిపిన దాడులకు ప్రతిస్పందనగానే ఈ చర్య చేపట్టినట్లు తెలిపింది. కువైట్‌లోని అమెరికా అలి అల్ సలేం వైమానిక స్థావరం, బహ్రెయిన్‌లోని అమెరికా ఐదో నౌకాదళ కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు ఐఆర్‌జీసీ ప్రకటించింది. కువైట్ అధికారులు తమ వైమానిక రక్షణ వ్యవస్థ రెండు బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకుందని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపారు. బహ్రెయిన్‌లో ఒక నివాస భవనానికి స్వల్ప నష్టం సంభవించినప్పటికీ, మరణాలు నమోదుకాలేదని అధికారులు వెల్లడించారు. అమెరికా కూడా తమ స్థావరాలకు గణనీయమైన నష్టం లేదా సైనికుల ప్రాణనష్టం జరగలేదని తెలిపింది.

### ట్రంప్ ఘాటు హెచ్చరిక

దాడులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. శాంతి ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ ఇరాన్ దాడులు కొనసాగిస్తే అమెరికా మరింత కఠిన సైనిక చర్యలకు దిగుతుందని హెచ్చరించారు. అవసరమైతే "ఇరాన్ అనే దేశం ఉనికే లేకుండా చేసే స్థాయిలో చర్యలు తీసుకుంటాం" అని వ్యాఖ్యానించినట్లు అమెరికా మీడియా తెలిపింది. ఇటీవలి రోజులుగా అమెరికా--ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గించేందుకు జరుగుతున్న దౌత్య చర్చలకు తాజా పరిణామాలు తీవ్ర విఘాతం కలిగించాయి. హర్మూజ్ జలసంధి భద్రత, చమురు రవాణా, ఆంక్షలు వంటి అంశాలపై కొనసాగుతున్న చర్చలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందని అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు. దాడుల అనంతరం కువైట్, బహ్రెయిన్‌లలో అత్యున్నత భద్రతా హెచ్చరికలు జారీ చేశారు. గల్ఫ్ దేశాలు అప్రమత్తమవగా, అంతర్జాతీయ చమురు రవాణాపై కూడా ఈ పరిణామాల ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# మోదీకి మరో అంతర్జాతీయ గౌరవం

- సీషెల్స్ అత్యున్నత పర్యావరణ అవార్డు ప్రదానం!
- ప్రధాని నరేంద్ర మోదీ ఖాతాలో మరో అంతర్జాతీయ పురస్కారం
- భారత్ ప్రతిష్ట అంతరిక్షం నుంచి సముద్రం దాకా



**న్యూఢిల్లీ:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అంతర్జాతీయ వేదికపై మరో అరుదైన మరియు అత్యున్నత గౌరవం దక్కింది. హిందూ మహాసముద్రంలోని ప్రముఖ ద్వీప దేశమైన సీషెల్స్ ప్రభుత్వం తమ దేశపు అత్యున్నత పర్యావరణ పురస్కారమైన "గార్డియన్ ఆఫ్ ది బ్లూ హొరైజన్" (+ఋతీఏఋఋఅ శీట ్ష్రవ దీశ్రీబవ ఎశీతీఱఓశీఅ) అవార్డును ప్రధాని మోదీకి అధికారికంగా ప్రదానం చేసింది. ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి మరియు వేగంగా మారుతున్న వాతావరణ మార్పుల నియంత్రణలో ప్రధాని మోదీ ప్రదర్శిస్తున్న అంతర్జాతీయ మార్గదర్శకత్వానికి, అద్భుత నాయకత్వానికి గుర్తింపుగా సీషెల్స్ ఈ ఘన సత్కారాన్ని ప్రకటించింది. గ్లోబల్ లీడర్‌గా ప్రపంచ పర్యావరణ పరిరక్షణలో భారత్ పోషిస్తున్న కీలక పాత్రకు ఈ పురస్కారం మరో నిదర్శనంగా నిలిచింది. ఈ ప్రతిష్టాత్మక అవార్డును ప్రకటించిన సందర్భంగా సీషెల్స్ ప్రభుత్వం ప్రధాని మోదీ అనుసరిస్తున్న పర్యావరణ విధానాలపై ప్రత్యేక ప్రశంసలు కురిపించింది. పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు, బ్లూ ఎకానమీ (సముద్ర ఆధారిత ఆర్థిక వృద్ధి), సుస్థిర అభివృద్ధి మరియు సముద్ర వనరులను బాధ్యతాయుతమైన పద్ధతిలో వినియోగించుకోవడంలో మోదీ చూపిన చొరవను ప్రభుత్వం కొనియాడింది. ముఖ్యంగా వాతావరణ మార్పుల వల్ల తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్న చిన్న ద్వీప దేశాల (ూఎఋశ్రీశ్రీ ×ంశ్రీఋఅస చీఃఱశీఅం) సర్వతోముఖాభివృద్ధికి, ఆయా దేశాలలో వాతావరణ స్థిరత్వం కోసం భారతదేశం అందిస్తున్న ఆర్థిక, సాంకేతిక, వ్యూహాత్మక సహాయ సహకారాలను ఈ సందర్భంగా సీషెల్స్ ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ కృతజ్ఞతలు తెలిపింది. తనకు దక్కిన ఈ అంతర్జాతీయ గౌరవంపై ప్రధాని నరేంద్ర మోదీ అత్యంత వినమ్రంగా స్పందించారు. సీషెల్స్ ప్రభుత్వం అందించిన "గార్డియన్ ఆఫ్ ది బ్లూ హొరైజన్" అవార్డును తాను ఎంతో గౌరవంతో స్వీకరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ అత్యున్నత పురస్కారాన్ని ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పుల సవాళ్లను నిత్యం ఎదుర్కొంటున్న వివిధ దేశాల ప్రజలకు మరియు రాబోయే భవిష్యత్ తరాల మేలు కోసం పర్యావరణ పరిరక్షణను తమ బాధ్యతగా భావిస్తూ అలుపెరగక శ్రమిస్తున్న ప్రతి ఒక్కరికీ అంకితం చేస్తున్నట్లు ప్రధాని వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణలో భారతదేశం ప్రపంచ దేశాలతో కలిసి మున్ముందు మరింత చురుకుగా పనిచేస్తుందని ఉద్ఘాటించారు. ప్రధాని మోదీకి అంతర్జాతీయ సంస్థలు, దేశాల నుంచి అత్యున్నత పురస్కారాలు దక్కడం ఇదే మొదటిసారి కాదు. వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించడం, ప్రపంచవ్యాప్తంగా సుస్థిర వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతో పాటు ఆహార భద్రతను బలోపేతం చేసినందుకు గానూ ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార మరియు వ్యవసాయ సంస్థ (ఖీూూ) ఇటీవల మే 2026 లో ప్రధాని మోదీకి ప్రతిష్ఠాత్మకమైన "అగ్రికోలా" (ూస్త్రతీఱ-ఛశీశ్రీఋ) పతకాన్ని ప్రదానం చేసింది. అంతకుముందు 2018వ సంవత్సరంలో సుస్థిర ఆర్థిక వృద్ధి, అంతర్జాతీయ సహకారం మరియు సమ్మిళిత అభివృద్ధిని ప్రపంచవ్యాప్తంగా విస్తరింపజేసినందుకు ఆయనకు ప్రతిష్టాత్మక "సియోల్ శాంతి బహుమతి" లభించింది. అదే ఏడాది వాతావరణ చర్యలు, గ్లోబల్ పర్యావరణ భాగస్వామ్యంలో ఆయన అసాధారణ నాయకత్వాన్ని గుర్తిస్తూ ఐక్యరాజ్యసమితి (ఖచీ) సైతం తన అత్యున్నత పర్యావరణ పురస్కారమైన 'ఛాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్' అవార్డుతో మోదీని గౌరవించింది.

# నేలకొండపల్లి మండలంలో ప్రభుత్వ భూమి కబ్జా..

- సర్వేనెంబర్ 1191లో అక్రమ కట్టడాల కలకలం
- రిజిస్ట్రేషన్లు ఎలా చేశారు?
- ఇంటి నంబర్లు ఎవరిచ్చారు?
- సీసీ రోడ్లు ఎలా వేశారు?
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కలెక్టర్ విచారణ జరిపి భూమి స్వాధీనం చేసుకోవాలని ప్రజల డిమాండ్



**ఖమ్మం, రాజముద్ర న్యూస్**

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలో ప్రభుత్వ భూమిని యథేచ్ఛగా కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టారనే ఆరోపణలు సంచలనం రేపుతున్నాయి. సర్వేనెంబర్ 1191లోని భూమి ప్రభుత్వ భూమి అని రెవెన్యూ అధికారులు తేల్చిచెప్పినా, అక్కడ పక్కా ఇళ్లు వెలిశాయి. రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఇంటి నంబర్లు మంజూరయ్యాయి. ఏకంగా సీసీ రోడ్లు కూడా వేశారంటే అధికారుల పాత్రపై అనేకఅనుమానాలువ్యక్తమవుతున్నాయి. నేలకొండపల్లి మండల పరిధిలోని సర్వేనెంబర్ 1191 భూమి ప్రభుత్వ భూమిగా రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉంది. దీనిని అధికారులు కూడా గతంలో ధ్రువీకరించారు. అయితే, ఆ భూమిలో అనేక అక్రమ కట్టడాలు వెలిశాయి. కొందరు ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. ప్రభుత్వ భూమి అని తెలిసి కూడా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఎలా రిజిస్ట్రేషన్ చేశారు? ఇంటి నంబర్లు ఎవరిచ్చారు? గ్రామ పంచాయతీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండా అక్రమ ఇళ్లకు ఇంటి నంబర్లు ఎలా మంజూరు చేశారు? సీసీ రోడ్లు ఎలా వేశారు? ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఉన్న లేఅవుట్‌లో పంచాయతీ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఎలా నిర్మించారు? "ప్రభుత్వ భూమి అని ఒకపక్క అధికారులు చెబుతున్నారు. మరోపక్క అదే భూమిలో ఇళ్లు కడుతున్నారు, రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి, ఇంటి నంబర్లు ఇస్తున్నారు, రోడ్లు వేస్తున్నారు. ఇదంతా అధికారుల కనుసన్నల్లో జరగకుండా సాధ్యమా? ఇక్కడ ఏదో పెద్ద మతలబు జరిగింది" అని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**మంత్రి పొంగులేటిపై ఆశలు**

పాలేరు నియోజకవర్గానికి చెందిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇప్పటికైనా ఈ వ్యవహారంపై సమగ్ర విచారణకు ఆదేశించాలని ప్రజలు కోరుతున్నారు. "మంత్రి గారు రెవెన్యూ శాఖను ప్రక్షాళన చేస్తానన్నారు. ముందు మా మండలంలోని ఈ 1191 సర్వేనెంబర్ భూమి కబ్జాపై చర్యలు తీసుకోవాలి" అని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రజల ప్రధాన డిమాండ్లు**

**భూమి స్వాధీనం:** సర్వేనెంబర్ 1191లోని ప్రభుత్వ భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలి.ఉన్నతస్థాయి విచారణ కలెక్టర్ లేదా ఆర్డీవో స్థాయి అధికారితో విచారణ జరిపించాలి.బాధ్యులపై చర్యలు అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.అధికారులపై చర్యలు అక్రమ రిజిస్ట్రేషన్లు చేసిన, ఇంటి నంబర్లు ఇచ్చిన, పర్మిషన్లు మంజూరు చేసిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి.

**అధికారుల మౌనం వీడేదెన్నడు?**

ఈ వ్యవహారంపై రెవెన్యూ, పంచాయతీరాజ్, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు ఇప్పటివరకు స్పష్టత ఇవ్వకపోవడం గమనార్హం. చర్యలు చేపట్టకపోవడంతో అధికారుల పాత్రపై అనుమానాలు మరింత బలపడుతున్నాయి.ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో ప్రభుత్వం ఎంత కఠినంగా ఉందో చెప్పడానికి ఈ భూమి వ్యవహారం ఒక పరీక్ష లాంటిది. ఇప్పటికైనా కలెక్టర్, రెవెన్యూ మంత్రి స్పందించి నిజాలు నిగ్గుతేల్చి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నేలకొండపల్లి మండల ప్రజలు కోరుతున్నారు.



# సర్ పేరుతో ఓట్ల దొంగలింపును అడ్డుకోండి

- సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు
- దేశం కోసం త్యాగాలు చేసింది కమ్యూనిస్టులే
- సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు పి సోమయ్య
- ఉత్సాహపూరితంగా సిపిఐ(ఎం) పాలేరు డివిజన్ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు

**ఖమ్మం రాజముద్ర న్యూస్.**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) పేరుతో దేశంలో ఓట్ల దొంగతనం జరుగుతుందని, దాన్ని అడ్డుకోవాలని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు, నాయకులకు పిలుపునిచ్చారు. నేలకొండపల్లి మండల కేంద్రంలోని స్థానిక శ్రీకర ఫంక్షన్ హాల్లో పార్టీ పాలేరు డివిజన్ స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల ప్రారంభ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని క్లాసులను ప్రారంభించారు. తొలుత ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు నూతలపాటి అప్పారావు ఆవిష్కరించారు. అనంతరం నున్న నాగేశ్వరరావు మాట్లాడుతూ, సామ్రాజ్య వాద దేశాలు తమ స్వార్థం కోసం యుద్ధాలు చేస్తూ ప్రపంచవ్యాప్తంగా ధరల పెరుగుదలకు కారణమవుతున్నాయన్నారు. యుద్ధాల వలన సామాన్య మధ్యతరగతి ప్రజలతో పాటు ప్రతి ఒక్కరూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని యుద్ధాలను ప్రతి ఒక్కరు ఖండిస్తూ ప్రపంచ శాంతిని కోరుకుంటూ నినదించాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలతో ప్రజల మధ్య చీలికలు పెడుతూ పబ్బం గడుపుతున్నాయని విమర్శించారు. బిజెపి అసమర్థ విధానాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వ విఫలమైందని విమర్శించారు. సంక్షేమ పథకాల అమలు తీరుపై గ్రామాలలో పార్టీ కార్యకర్తలు అధ్యయనం చేసి అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందే వరకు గ్రామాల్లో పోరాటాలు నిర్వహించాలన్నారు. అనంతరం మధ్యాహ్నం మార్క్సిస్ట్ మూల సూత్రాలు భారత దేశానికి అన్వయింపు అనే అంశంపై పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు పి సోమయ్య తరగతి బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన వారు కమ్యూనిస్టులు ముందు వరుసలో ఉన్నారని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన నాటి నుండి అనేక నిర్బంధాలు ఎదుర్కొని ప్రజల కోసం నిరంతరం పని చేస్తుందన్నారు. ప్రజల బాగోగుల కోసం అవిశ్రాంతంగా పోరాడింది, నిస్వార్థంగా త్యాగాలు చేసింది, సిపిఐ(ఎం) మాత్రమేనని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కార్యదర్శి బండి రమేష్ మాట్లాడుతూ మూడు రోజులపాటు జరగనున్న పార్టీ పాలేరు డివిజన్ స్థాయి రాజకీయ శిక్షణా తరగతులకు నాలుగు మండలాల నుండి పార్టీ డివిజన్, మండల నాయకులు, శాఖ కార్యదర్శులు అత్యంత ఉత్సాహపూరితంగా పాల్గొనడం సంతోషకరమన్నారు. ఈ క్లాసులకు మొదటిరోజు డివిజన్ వ్యాప్తంగా 250 మంది నిష్ణాతులైన పార్టీ కార్యకర్తలు హాజరయ్యారన్నారు. మరో రెండు రోజులపాటు జరగనున్న పార్టీ శిక్షణ తరగతులకు కూడా ప్రతినిధులు సకాలంలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మూడు రోజుల పాటు జరగనున్న శిక్షణా తరగతులకు ప్రిన్సిపల్ గా పార్టీ జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు వ్యవహరిస్తారన్నారు. ఈ శిక్షణ తరగతులలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నంద్ర ప్రసాద్, షేక్ బషీరుద్దీన్, ఊరడి సుదర్శన్ రెడ్డి, కొమ్ము శ్రీను, మల్లెల సన్మంతరావు, మండల కార్యదర్శులు కె.వి రామిరెడ్డి, తోటకూరి రాజశేఖర్ (రాజు), వడ్లమూడి నాగేశ్వరరావు, పార్టీ డివిజన్ నాయకులు పెండ్యాల సుమతి, బెల్లం లక్ష్మి , వేగినాటి మంగతాయారు, పగిడికత్తుల నాగేశ్వరరావు రచ్చ నరసింహారావు, మారుతి కొండలరావు, శీలం గురుమూర్తి, బిక్కసాని గంగాధర్, దాసరి మహేందర్, తుళ్లూరు నాగేశ్వరరావు, అంగిరేకుల నరసయ్య, పెరుమాళ్ళపల్లి మోహన్ రావు, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, భూక్య నాగేశ్వరరావు, నందిగామ కృష్ణ, సిరికొండ ఉమామహేశ్వరి, సీనియర్ నాయకులు ఏటుకూరి రామారావు దుగ్గి వెంకటేశ్వర్లు భూక్య కృష్ణతో పాటు మరో 250 మంది పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.






# జర్నలిస్టులపై మూకదాడి ప్రజాస్వామ్యంపై దాడే..!

**దోషులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలి**
**టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ రాంరెడ్డి డిమాండ్**

**మేడిపల్లి, జూన్ 28, రాజముద్ర న్యూస్:**

సమాజానికి నిజాలను చేరవేస్తున్న జర్నలిస్టులపై దాడులు చేయడం అత్యంత హేయమైన చర్య అని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ రాంరెడ్డి తీవ్రంగా ఖండించారు. మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ అంబేద్కర్ నగర్‌లో జరిగిన ఘటనలో జర్నలిస్టు విష్ణుపై మూకుమ్మడిగా దాడి చేయడం, అతని ఇంటిపై రాళ్లు రువ్వడం, కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేయడం, వాహనాలను ధ్వంసం చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆదివారం మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో సీఐ జలంధర్ రెడ్డికి వినతిపత్రం అందజేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కాలనీలో జరిగిన ఘర్షణకు సంబంధించిన దృశ్యాలను విధి నిర్వహణలో భాగంగా చిత్రీకరిస్తున్న జర్నలిస్టుపై దాడి చేయడం మీడియా స్వేచ్ఛను అణచివేసే ప్రయత్నమని అన్నారు. ప్రజలకు సమాచారం అందిస్తున్న విలేకరులను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులకు పాల్పడటం ఏ మాత్రం సహించబోమని హెచ్చరించారు. జరిగిన ఘటనపై పోలీసులు సమగ్ర దర్యాప్తు జరిపి దాడికి పాల్పడిన ప్రతి ఒక్కరిని గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని, కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల భద్రతకు పోలీసులు పూర్తి హామీ ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ ముఖ్య సలహాదారులు కల్యారి ఎల్లయ్య, వి. సూర్యనారాయణ రెడ్డి, అధ్యక్షుడు శ్రీదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వి. సుందర్, కోశాధికారి మరాటి మల్లేష్, ఉపాధ్యక్షుడు చింత రమేష్, రాము యాదవ్, నాగరాజు, శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, భాస్కర్, మత్స్యగిరి, భగీరథ్ రెడ్డి, కమలాకర్, కుమారస్వామి, ప్రవీణ్, వెంకట్, ఉపేందర్, సిద్ధు తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు



# జర్నలిస్టులపై దాడి హేయమైన చర్య

- జర్నలిస్టుల దాడిని తీవ్రంగా ఖండించిన నత్తి మైసయ్య
- దోషులను కఠినంగా శిక్షించాలి

**బోడుప్పల్ రాజముద్ర న్యూస్:**

ప్రజా సమస్యలపై నిత్యం పోరాడుతూ, అధికారులకు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సేవ చేసే విలేకరులపై దాడులు చేయడం ఏమైనా చర్య అని, మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ అంబేద్కర్ నగర్‌లో జర్నలిస్టు విష్ణుపై మూకుమ్మడిగా దాడి చేయడం, అతని ఇంటిపై రాళ్లు రువ్వడం, కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేయడం, వాహనాలను ధ్వంసం చేయడం దారుణమని ఈ సంఘటనను అంబేద్కర్ ఆశయ సాధన సంఘం తీవ్రంగా ఖండిస్తుందని నత్తి మైసయ్య అన్నారు. అలాగే దోషులను కఠినంగా శిక్షించి జర్నలిస్టు విష్ణు కు న్యాయం చేయాలని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నత్తి మైసయ్య పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

# రెండు చుక్కలు.. చిన్నారుల భవిష్యత్తుకు భరోసా

- ఖమ్మం జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభం..
- ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి వ్యాక్సిన్ అందించడమే లక్ష్యం

**ఖమ్మం రాజముద్ర న్యూస్**



పోలియో మహమ్మారిని పూర్తిగా తరిమికొట్టేందుకు రెండు చుక్కలే శాశ్వత రక్షణ కవచం. చిన్నారుల అడుగుల్లో జీవితాంతం ధైర్యం నింపే పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఘనంగా ప్రారంభమైంది.

నేలకొండపల్లి మండలం చెన్నారం గ్రామంలోని పల్లె దవాఖానలో ఉప సర్పంచ్ నెమలి జ్యోతి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "ఆరోగ్యవంతమైన బాల్యం, వైకల్య రహిత భవిష్యత్తు కోసం ప్రతి తల్లిదండ్రి బాధ్యత తీసుకోవాలి. ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా రెండు చుక్కలు వేయించాలి" అని పిలుపునిచ్చారు.వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో భారీ ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక పోలియో బూత్‌లు ఏర్పాటు చేశారు. జననం నుండి ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి రెండు చుక్కల వ్యాక్సిన్ అందిస్తున్నారు.పోలియో వైరస్ ఒకసారి శరీరంలోకి ప్రవేశిస్తే జీవితాంతం వైకల్యానికి గురిచేసే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ వ్యాధికి పూర్తిస్థాయి చికిత్స లేకపోవడంతో 'నివారణే మహా రక్షణ' అనే సూత్రంతో ప్రభుత్వం ఏటా పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. గతంలో ఎన్నిసార్లు చుక్కలు వేసుకున్నా, ప్రతి విడతలోనూ మరోసారి వేయించడం ద్వారా పిల్లల్లో రోగనిరోధక శక్తి మరింత బలపడుతుందని వైద్యులు చెబుతున్నారు.జిల్లా యంత్రాంగం 'ఒక్క చిన్నారి కూడా మిగలొద్దు' అనే లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోంది. తొలి రోజు బూత్‌లలో చుక్కలు వేయించని చిన్నారులను గుర్తించి, ఇంటింటికీ వెళ్లి వ్యాక్సిన్ అందించేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధం చేశారు. గిరిజన తండాలు, మారుమూల గ్రామాలు, వలస కార్మికుల నివాసాలు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాల్లోని చిన్నారులను కూడా కవర్ చేసేలా ప్రణాళిక రూపొందించారు.

వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేస్తున్నారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ చుక్కల ఆవశ్యకతను వివరిస్తున్నారు. "పిల్లల చిరునవ్వే కుటుంబానికి ఆనందం. వారి ఆరోగ్యమే సమాజానికి అసలైన సంపద" అని అధికారులు పేర్కొన్నారు.

# పోలియో చుక్కల కోసం పక్కూరికి

## - పర్యవేక్షించవలసిన అధికారుల జాడా...?



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** 0 నుండి 5 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు ఆదివారం వికారాబాద్ జిల్లా పరిధిలో నిర్వహించడం జరిగింది. కానీ వికారాబాద్ జిల్లా పరిధిలోని ఓ గ్రామంలో మధ్యాహ్నానికే పోలియో చుక్కల మందు అయిపోవడంతో పక్కూరికి వెళ్ళవలసిన సంఘటన చోటు చేసుకున్నట్లు కొందరు ఆరోపించారు. ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా వికారాబాద్ జిల్లా పరిధిలోని ఓ గ్రామంలో మధ్యాహ్నానికే ప్రభుత్వం వారికి ఇచ్చిన పల్స్ పోలియో చుక్కల మందు అయిపోవడంతో పక్క ఊరికి వెళ్లి వేయించుకోమని తెలిపినట్లు పేర్కొన్నారు. పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించిన అనంతరం రూట్ సూపర్వైజర్లతో పాటు ఇతర అధికారులు కూడా పర్యవేక్షించవలసిన అవసరం ఉందన్నారు. ఈ పరిస్థితి నెలకొన్న పట్టించుకోకుండా పక్క ఊరికి పంపించడం ఎంతవరకు సరి అయినదో సంబంధిత శాఖ అధికారులు ఆలోచించాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న ఊరిలో వేయాల్సిన పల్స్ పోలియో చుక్కలు పక్కూరికి వెళ్లి పల్స్ పోలియో చుక్కలు వేసుకోవలసిన పరిస్థితి నెలకొందన్నారు.

# 96 శాతం మందికి పోలియో చుక్కలు

**- వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె సుధాకర్ లాల్**



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :**

ఆదివారం వికారాబాద్ జిల్లాలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఐదు సంవత్సరాల లోపు 96 శాతం చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే సుధాకర్ లాల్ తెలిపారు. వికారాబాద్ పట్టణంలోని రామయ్యగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రాజీవ్ గృహకల్పలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో బూతులో వికారాబాద్ మునిసిపల్ వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి పోలియో చుక్కలు వేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జిల్లాల్లో వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాలను సందర్శించి తగు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ జైదుపల్లి లక్ష్మి , డాక్టర్ సౌమ్య, డాక్టర్ నిఖిల్ , డిప్యూటీ డెమో శ్రీనివాసులు, మహేష్ కుమార్ , మురళి తదితరులు పాల్గొన్నారు.

# 'మూడుసార్లు కొలిచారు.. రోడ్డు మాత్రం మరిచారు'

**పదేళ్లుగా బురదలోనే చెన్నారం పాండవ చెలక రహదారి.. "మంత్రి గారు, మేము మీకు ఓట్లేశాం, మా రోడ్డు వేయించండి"**



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :**

నేలకొండపల్లి,"ఎన్నికలప్పుడు ఫొటోలకు పోజులు, గెలిచాక మా రోడ్డుకు దిక్కులేదు" అని నేలకొండపల్లి మండలం చెన్నారం పాండవ చెలక కాలని గ్రామస్తులు కన్నీటి పర్యంతమవుతున్నారు. గత పదేళ్లుగా చినుకు పడితే చాలు చెరువులా మారే తమ ఊరి రహదారిని ముగ్గురు నేతలు, మూడుసార్లు కొలిచి వెళ్లారే తప్ప ఒక్క అడుగు రోడ్డు వేయలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.చెన్నారం గ్రామంలోని ఈ రహదారి పరిస్థితి వర్షాకాలం వస్తే వర్ణనాతీతం. మోకాళ్లలోతు నీరు, బురదతో వాహనాలు వెళ్లలేని స్థితి. స్కూలుకు వెళ్లే పిల్లలు, ఆసుపత్రికి వెళ్లే రోగులు, వృద్ధులు ప్రతిరోజూ నరకం అనుభవిస్తున్నారు

**హామీల వరద.. పనులు మాత్రం శూన్యం**

"గత పదేళ్లలో ఎమ్మెల్యేలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు మారారు. కానీ మా రోడ్డు తలరాత మారలేదు. మూడుసార్లు జేసీబీలు తెచ్చి, టేపులు పట్టి కొలతలు వేశారు. 'వచ్చే నెలలోనే పనులు మొదలు' అని చెప్పారు. ఫొటోలు పేపర్లలో వచ్చాయి. కానీ రోడ్డు మాత్రం అలాగే ఉంది" అని సుతారి మేస్త్రి మహేష్ ఆవేదనతో తెలిపాడు.

**'మా పైన కక్ష ఎందుకు?**

"మంత్రి గారు, మా రోడ్డుపై కక్ష సాధింపు ఏమైనా ఉందా? గ్రామంలో కొందరు లీడర్ల మాటలు విని మా ఊరిని పట్టించుకోవడం లేదు. మేము మీకు ఓట్లు వేశాం. మా బాధలు తీర్చాల్సిన బాధ్యత మీపై ఉంది" అని యువకులు ప్రశ్నిస్తున్నారు. పాలేరు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇప్పటికైనా స్పందించి న్యాయం చేయాలని వారు వేడుకుంటున్నారు.ఈ సమస్యపై గ్రామ పంచాయతీ నుండి కలెక్టరేట్ వరకు వందలాది వినతిపత్రాలు ఇచ్చామని, కానీ ఏ ఒక్క అధికారి కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించలేదని గ్రామస్తులు వాపోతున్నారు. "ఓట్ల కోసం గడపగడపకూ వచ్చిన నాయకులు, సమస్యలు చెప్పుకోవడానికి వెళితే కనిపించడం లేదు" అని వారు వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి యుద్ధప్రాతిపదికన రోడ్డు నిర్మాణం చేపట్టాలని, లేని పక్షంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తామని చెన్నారం వాసులు ఆవేదనతో అన్నారు.

## పల్స్ పోలియో చుక్కలు ప్రతి ఒక్కరూ వేయించాలి

**మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి**

**పీర్జాదిగూడలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి**



**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:**



మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ డివిజన్ కమలా నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని, తల్లిదండ్రులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు. పోలియో వంటి ప్రమాదకర వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా బాధ్యతాయుతంగా సహకరించాలని పిలుపునిచ్చారు. అలాగే, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో పల్స్ పోలియో కార్యక్రమం కీలకమని, ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్యామల శ్రీనివాస్, వెంకట్, పన్నాభాయ్, అంగన్వాడీ టీచర్ రమాదేవి, ఆశా వర్కర్ షాకిరా తదితరులు పాల్గొన్నారు.



## పల్స్ పోలియో ప్రారంభించిన డిఎంహెచ్ఓ

**ఆర్మూర్ , జూన్ 28 :**

ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రంలో ఆదివారం రోజు పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ రాజశ్రీ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలియో వ్యాధి చిన్న పిల్లలకు వచ్చే పోలియో వైరస్ ప్రస్తుతం భారతదేశంలో పూర్తిగా నిర్మూలించబడిందన్నారు. కానీ పొరుగున ఉన్న దేశాల వల్ల వ్యాధి వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయి. కాబట్టి దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. జిల్లాలో ఉన్న ప్రతి గ్రామంలో ప్రతి వార్డులలో ప్రతి తాండాలలో అన్ని ప్రాంతాలలో 0–5 సం.వయసు మధ్య గల పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించవలనని, మొదటి రోజున పోలియో శిబిరాల వద్ద పిల్లలకు చుక్కలు వేయబడునని మిగతా రెండు రోజులు అనగా సోమవారం, మంగళవారం రోజులలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఇంకా మిగిలిపోయిన పిల్లలందరినీ ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు ఆరోగ్య సిబ్బంది ద్వారా వేయబడునని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవలసిందిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ రవీందర్, రోటరీ క్లబ్ సభ్యులు రాధా కిషన్, చరణ్, విజయ సారథి, తులసి కుమార్, ఆరోగ్య సిబ్బంది సాయి, చంద్రశేఖర్, శంకర్, ఆనంద్, ఆర్మూర్ పట్టణ వైద్యాధికారిని డాక్టర్ శ్రేయ, తదితరులు పాల్గొన్నారు.




## 'మన్ భూమి కన్స్ట్రక్షన్స్ ఆక్రమణలు వెంటనే ఆపాలి'

**కైలాస్ హిల్స్ వాసులు**

- **ధర్నాలో పాల్గొన్న సుమారు 200 మంది..!**
- **జీహెచ్ఎంసీ, టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం..!**
- **సమస్య పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరిక..!**

**రాజముద్ర, కుత్బుల్లాపూర్ న్యూస్:**

నియోజకవర్గంలోని మహాదేవపురం డివిజన్‌లోని కైలాస్ హిల్స్ కాలనీ వాసులు ఆదివారం భారీ ధర్నా నిర్వహించారు. సుమారు 200 మంది కాలనీవాసులు ఈ ఆందోళనలో పాల్గొని, తమ కాలనీకి చెందిన 30 అడుగుల సీసీ రోడ్డును ఆక్రమిస్తూ మన్ భూమి కన్స్ట్రక్షన్స్ అక్రమ నిర్మాణాలు చేపడుతోందని ఆరోపించారు. వెంటనే ఆ నిర్మాణాలను నిలిపివేసి రోడ్డును ఆక్రమణల నుంచి విముక్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. కాలనీవాసుల కథనం ప్రకారం, ఈ అంశంపై పలుమార్లు జీహెచ్ఎంసీ, టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కైలాస్ హిల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంజేష్ రెడ్డి మాట్లాడుతూ, 30 అడుగుల సీసీ రోడ్డుపై జరుగుతున్న ఆక్రమణలను వెంటనే తొలగించి కాలనీవాసులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కాలనీవాసుల సమస్యలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను కోరారు.

## పిడుగుపాటుకు 15 మేకలు మృతి

**దారూర్ మండల రుద్రారంలో విషాదం**

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :**



పిడుగుపాటుకు 15 మేకలు మృతి చెందిన సంఘటన వికారాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...

వికారాబాద్ జిల్లా దారూర్ మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో పిడుగు పడి 15 మేకలు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. గ్రామ శివారులో మేతకు వెళ్లిన మేకల మందపై ఒక్కసారిగా పిడుగు పడడంతో ఈ ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. దీంతో గొర్రెల కాపరి కుటుంబం తీవ్రంగా నష్టపోయింది. విషయం తెలుసుకున్న స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సంబంధిత అధికారులు స్పందించి బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందించాలని గ్రామస్తులు కోరారు.

## తెలంగాణ ఆదర్శ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**జూన్ 29 వరకు దరఖాస్తుల స్వీకరణ.. 30న డెమో, సర్టిఫికెట్ల పరిశీలన.**

**నిజామాబాద్ రూరల్, సిరికొండ జూన్ 28:**



సిరికొండ మండల కేంద్రంలోని పీఎం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల & జూనియర్ కళాశాలలో 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు తెలుగు బోధించేందుకు తాత్కాలిక ప్రాతిపదికన ఉపాధ్యాయ నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డి తెలిపారు.ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో డిగ్రీతో పాటు బీఈడ్ లేదా టీపీటీ (TPT) అర్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను జూన్ 29, 2026లోపు పాఠశాలలో సమర్పించాలని సూచించారు.దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జూన్ 30న డెమో తరగతి నిర్వహించి, విద్యార్హతల సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం తుది ఎంపిక చేపడతామని తెలిపారు.ఎంపికైన అభ్యర్థులకు బోధించిన ప్రతి గంటకు రూ.182 చొప్పున, నెలకు గరిష్టంగా రూ.18,200 వరకు పారితోషికం చెల్లించనున్నట్లు వెల్లడించారు.అభ్యర్థులు పూర్తి వివరాల కోసం ప్రిన్సిపాల్ సంప్రదించాలని సూచించారు

# ఎన్.పి.డి.సి.ఎల్ లో భారీ కుంభకోణం.?

- **ఏడిఈ అవినీతి అక్రమాలు అంతా ఇంతా కాదయా....!**
- **ఏడిఈ కి డిఈ కి కుదిరిన డీల్ ఎంతో?....**
- **వర్క్ ఆర్డర్లు క్లోజ్ చేయడానికి ప్రయత్నం చేస్తున్న డిఈ...?**

**ఆర్మూర్, జూన్ 28:**




తెలంగాణ రాష్ట్రంలోని ప్రతిష్టాత్మకంగా వినియోగదారులకు సేవలు అందిస్తున్న నార్తన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ ఆర్మూర్ డివిజన్ పరిధిలో భారి కుంభకోణం జరిగినట్లు సమాచారం. ఆర్మూర్ డివిజన్ పరిధిలోనీ మోర్తాడ్ ఏడిఈ గా విధులు నిర్వహించిన ఒక అధికారి మరో మండలం అయిన ఏర్గట్ల కు ఏఈ లేక పోవడంతో ఆ స్థానంలో ఇంచార్జి గా బాధ్యతలు చేపట్టిన సదరు ఏడిఈ, మండలం లోనీ వినియోగదారుల నుండి విచ్చల విడిగా డబ్బులు వసూలు చేసి, వారికి అన్ని విధాలుగా సహకరిస్తానని మాయ మాటలు చెప్పి దాదాపుగా 100 వరకు వర్క్ ఆర్డర్లు ఎన్పీడీసీఎల్ డిస్కమ్ ద్వారా తీసుకొని వాటిని క్లోజ్ చేయకుండా దాదాపు మూడు సంవత్సరాలుగా పెండింగ్ పెట్టీ, తీరా వేరే కామారెడ్డి సర్కిల్ ప్రాంతానికి బదిలీ పై వెళ్ళారు. 2022 సెప్టెంబర్ వరకు మోర్తాడ్ ఏడిఈ గా విధులు నిర్వహించి ఆయన పైన ఉన్నా వర్క్ ఆర్డర్లు కొత్తగా వచ్చిన ఏర్గట్ల ఏఈ తో డీల్ మాట్లాడుకొని అతని పేరు మీదకి మార్చరాని వినికిడి. మోర్తాడ్ ఏడిఈ గా లీవ్ లో వెళ్లి కామారెడ్డి సర్కిల్ లో ఏడీఈ గా పోస్టింగ్ తెచ్చుకుని అక్కడ కూడా దాదాపుగా 120 వర్క్ ఆర్డర్స్ క్లోజ్ చేయకుండ ఎన్పీడీసీఎల్ డిపార్ట్‌మెంట్ కి అటు కన్జ్యూమర్స్ కి నష్టం చేస్తూ, ఇక్కడ ఆర్మూర్ డివిజన్ పరిధిలో ఆయన వర్క్ ఆర్డర్లు క్లోజ్ చేయడానికీ డీల్ మాట్లాడుకొనే ప్రయాత్నం చేస్తున్నాడు అని సమాచారం. ఈ డీల్ విలువ దాదాపుగా 10 లక్షలు ఉంటుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. సదరు ఏడీఈ తనకు సంబంధించిన వర్క్ ఆర్డర్లు ఏఈ పైనా ఉన్నా వర్క్ ఆర్డర్స్ క్లోజ్ చేయించడానికి ఉన్నందుకు ఏఈ పర్సనల్ అకౌంట్ లో 10 లక్షలు పెట్టీ ఉంటారని సమాచారం. మొత్తం దాదాపుగా 100 వర్క్ ఆర్డర్లు వినియోగదారుల నుండి వసూళ్లు విలువలు సుమారు 2 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్న ఏర్గట్ల కన్స్యూమర్లు, ఇది పోనీ మరి మూడు సంవత్సరాలుగా జీతం లేకుండా ఉన్నాడంటే ఎంతగా అవినీతి చేసాడో అందుకే అతని పైనా ఆదాయానికి మించిన అస్తుల మీద ఎందుకు చర్యలు లేవు అంటున్న ప్రజలు. ఈ వర్క్ ఆర్డర్స్ పైనా ఇద్దరు ఆర్మూర్ ఏడీఈలు గతంలో విచారణ జరిపినట్లు సమాచారం వారు ఇచ్చిన నివేదికలో ఏ మేరకు గోల్ మాల్ జరిగి ఉంటుందో అంటున్న విద్యుత్ సిబ్బంది. డివిజన్ కార్యాలయంలో ప్రస్తుతం ఉన్న డివిజన్ ఇంజనీర్ అధికారి అత్యుత్సాహం చూపిస్తూ వర్క్ ఆర్డర్లు క్లోజ్ చేయడానికి విశ్వప్రయత్నం చేస్తున్నారని సమాచారం. మరి ఏ మేరకు డీల్ కుదిరిందో అర్థం చేసుకోవడం కష్టం. మరి డిపార్ట్ మెంట్ కు ఏ మేరకు నష్టం బాటిల్లి ఉంటుందో. మరి రికవరీ ఎంత మేరకు చేస్తారో.? దీనిపై ఉన్నత అధికారులు ఏ మేరకు స్పందిస్తారో వేచి చూడాలి.

# వర్షం అడ్డంకి.. గెలుపు దిశగా భారత్ ఏ



**గాలే, జూన్ 28 :** భారత్ ఏ, శ్రీలంక ఏ జట్ల మధ్య జరుగుతున్న తొలి అనధికారిక టెస్టులో వర్షం ఆటకు అంతరాయం కలిగించింది. నాలుగో రోజు భారత్ ఏ జట్టు రెండో ఇన్నింగ్స్‌ను 189/8 వద్ద డిక్లేర్ చేసి శ్రీలంకకు 312 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం బౌలర్లు చెలరేగి ఆతిథ్య జట్టుకు ఆదిలోనే రెండు వికెట్ల షాక్ ఇచ్చారు. మొదటి ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు తీసిన అకీబ్ నబీ ధార్ రెండో ఇన్నింగ్స్‌లోనూ తన జోరు కొనసాగించాడు. ఓపెనర్ పవంత వీరసింఘే (20)ను బౌల్డ్ చేసి శ్రీలంకకు తొలి దెబ్బ తీశాడు. అనంతరం హర్ష్ దూబె బౌలింగ్‌లో నిరోషన్ డిక్‌వెల్లా (9) వెనుదిరిగాడు. దీంతో శ్రీలంక ఏ జట్టు 34 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. వర్షం కారణంగా ఆట నిలిచిపోయే సమయానికి అషెన్ బండార (1 నాటౌట్), నువనిందు ఫెర్నాండో (2 నాటౌట్) క్రీజులో ఉన్నారు. 6.3 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 37 పరుగులు చేసిన శ్రీలంక విజయానికి ఇంకా 275 పరుగులు అవసరం.

### తొలి ఇన్నింగ్స్‌లో భారత్ ఆధిక్యం

మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 113/2తో ఆట ప్రారంభించిన శ్రీలంక ఏ జట్టు 330 పరుగులకు ఆలౌటైంది. నువనిందు ఫెర్నాండో (84), అంజల బండార (70) పోరాడినా భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. అకీబ్ నబీ 4/58తో మెరిసగా, యశ్ ఠాకూర్ 2 వికెట్లు తీశాడు. దీంతో భారత్ ఏకు 160 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

### సాయి, జురెల్ శతకాల జోరు

భారత్ ఏ తొలి ఇన్నింగ్స్‌లో ఓపెనర్ సాయి సుదర్శన్ (132), వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ (141 నాటౌట్) అద్భుత శతకాలతో జట్టును భారీ స్కోరుకు చేర్చారు. షేక్ రషీద్ (63) కూడా కీలక ఇన్నింగ్స్ ఆడగా, భారత్ ఏ తొలి ఇన్నింగ్స్‌ను 452/6 వద్ద డిక్లేర్ చేసింది. అదే ఆధిక్యం మ్యాచ్‌లో ప్రస్తుతం భారత్‌ను విజయానికి చేరువ చేసింది.

# భారత్ జట్టుకు బెల్‌ఫాస్ట్‌లో ఘన స్వాగతం



**బెల్‌ఫాస్ట్, జూన్ 28 :** ఐర్లాండ్ పర్యటనలో ఉన్న భారత క్రికెట్ జట్టుకు బెల్‌ఫాస్ట్‌లోని భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో ఘన స్వాగతం లభించింది. కాన్సులేట్ జనరల్ కిరణ్ ఖత్రీ భారత ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బందిని ఆప్యాయంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కిరణ్ ఖత్రీ మాట్లాడుతూ క్రికెట్ ప్రపంచవ్యాప్తంగా ప్రజలను ఒక్క తాటిపైకి తీసుకువచ్చే శక్తివంతమైన క్రీడ అని పేర్కొన్నారు. అనంతరం ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ భారత క్రికెట్ ప్రయాణం, జట్టు లక్ష్యాల గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ఐర్లాండ్‌లోని ప్రవాస భారతీయులు, పలువురు విశిష్ట అతిథులు హాజరయ్యారు. కార్యక్రమానికి సంబంధించిన చిత్రాలను భారత క్రికెట్ నియంత్రణ మండలి సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది.

### సిరీస్ సమంపై భారత్ గురి

మరోవైపు తొలి టీ20లో ఓటమి చవిచూసిన భారత్ రెండో మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను సమం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. మొదటి మ్యాచ్‌లో ఐర్లాండ్‌ను 182 పరుగులకే కట్టడి చేసినప్పటికీ లక్ష్య ఛేదనలో భారత బ్యాటర్లు విఫలమయ్యారు. ఓపెనర్ అభిషేక్ శర్మ అర్ధశతకంతో పోరాడినా, ఐర్లాండ్ పేసర్లు మాథ్యూ హెూలార్డ్ మూడు వికెట్లు, అరంగేట్ర ఆటగాడు జై ముంద్రా రెండు వికెట్లు తీసి భారత్‌ను కట్టడి చేశారు. ఫలితంగా ఐర్లాండ్ 34 పరుగుల తేడాతో చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసి సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది.

# నేటి నుంచే ఫిఫా సమరం

**ఫిఫా జూన్ 28 :** ప్రపంచకప్-2026లో లీగ్ దశ ముగియడంతో నేటి నుంచి నాకౌట్ పోరుకు తెరలేవనుంది. 12 గ్రూపుల నుంచి తొలి రెండు స్థానాల్లో నిలిచిన 24 జట్లతో పాటు, అత్యుత్తమ ప్రదర్శన చేసిన ఎనిమిది మూడో స్థాన జట్లు కలిపి మొత్తం 32 జట్లు 32వ రౌండ్‌లో బరిలోకి దిగుతున్నాయి. చివరి గ్రూప్ మ్యాచ్‌లో అల్జీరియా, ఆస్ట్రియా జట్లు 3-3తో డ్రా కావడంతో రెండూ నాకౌట్‌కు అర్హత సాధించాయి. దీంతో 32వ రౌండ్‌కు చేరిన జట్ల జాబితా పూర్తయింది. నేటి తొలి మ్యాచ్‌లో ఆతిథ్య కెనడా, దక్షిణాఫ్రికా జట్లు తలపడనున్నాయి.

32వ రౌండ్ మ్యాచ్‌ల షెడ్యూల్

### జూన్ 29

కెనడా ఐ దక్షిణాఫ్రికా - ఉదయం 12:30
బ్రెజిల్ ఐ జపాన్ - రాత్రి 10:30

### జూన్ 30

జర్మనీ ఐ పరాగ్వే - ఉదయం 2:30
నెదర్లాండ్స్ ఐ మొరాకో - ఉదయం 6:30
ఐవరీ కోస్ట్ ఐ నార్వే - రాత్రి 10:30

### జూలై 1

ఫ్రాన్స్ ఐ స్వీడన్ - ఉదయం 2:30
మెక్సికో ఐ ఈక్వెడార్ - ఉదయం 6:30
ఇంగ్లండ్ ఐ డీఆర్ కాంగో - రాత్రి 9:30

### జూలై 2

బెల్జియం ఐ సెనెగల్ - ఉదయం 1:30
అమెరికా ఐ బోస్నియా-హెర్జెగొవినా - ఉదయం 5:30

### జూలై 3

స్పెయిన్ ఐ ఆస్ట్రియా - ఉదయం 12:30
పోర్చుగల్ ఐ క్రొయేషియా - ఉదయం 4:30
స్విట్జర్లాండ్ ఐ అల్జీరియా - ఉదయం 8:30
ఆస్ట్రేలియా ఐ ఈజిప్ట్ - రాత్రి 11:30

### జూలై 4

అర్జెంటీనా ఐ కాబో వెర్డె - ఉదయం 3:30
కొలంబియా ఐ ఘనా - ఉదయం 7:00









# మెస్సీ ఖాతాలో మరో అరుదైన రికార్డు

**డల్లాస్, జూన్ 28 :** అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. ఫిఫా ప్రపంచకప్ చరిత్రలో వరుసగా ఏడు మ్యాచ్‌ల్లో గోల్ చేసిన తొలి ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. జోర్డాన్‌తో జరిగిన చివరి గ్రూప్ మ్యాచ్‌లో ఫ్రీకిక్‌ను అద్భుతంగా గోల్‌గా మలిచి ఈ రికార్డును అందుకున్నాడు. ఈ మ్యాచ్‌లో మెస్సీ ఆరంభ జట్టులో లేకపోయినా, 60వ నిమిషంలో ప్రత్యామ్నాయ ఆటగాడిగా మైదానంలోకి దిగాడు. 80వ నిమిషంలో లభించిన ఫ్రీకిక్‌ను గోల్‌గా మలిచి అర్జెంటీనా విజయాన్ని ఖాయం చేశాడు. ఈ గోల్‌తో ప్రపంచకప్ టోర్నీల్లో మెస్సీ మొత్తం గోల్స్ సంఖ్య 19కి చేరింది. దీంతో తన ఆల్‌టైమ్ రికార్డును మరింత మెరుగుపరుచుకున్నాడు. అలాగే ప్రస్తుత గోల్డెన్ బూట్ రేసులో కైలియన్ ఎంబాపే, ఉస్మాన్ డెంబెలె, వినిసియస్ జూనియర్, ఎర్లింగ్ హాలాండ్‌ల కంటే రెండు గోల్స్ ఆధిక్యంలో నిలిచాడు. మెస్సీ గోల్స్ పరంపర 2022 ఖతార్ ప్రపంచకప్ నాకౌట్ దశలో ప్రారంభమైంది. రౌండ్ ఆఫ్-16, క్వార్టర్ ఫైనల్, సెమీఫైనల్, ఫైనల్‌తో పాటు ప్రస్తుత టోర్నీలోనూ వరుసగా గోల్స్ నమోదు చేశాడు. అల్జీరియాపై హ్యాట్రిక్, ఆస్ట్రియాపై రెండు గోల్స్ చేసి తన జోరును కొనసాగించాడు.

ఇది మెస్సీకి ఆరో ఫిఫా ప్రపంచకప్. 2006, 2010, 2014, 2018, 2022, 2026 ప్రపంచకప్‌లలో బరిలోకి దిగిన ఏకైక పురుష ఫుట్‌బాల్ క్రీడాకారుడిగా కూడా అతడు మరో చారిత్రక ఘనత సాధించాడు. నాకౌట్ దశకు అర్జెంటీనా చేరుకోవడంతో మెస్సీ ఖాతాలో మరిన్ని రికార్డులు చేరే అవకాశముంది.



# చివరి బంతికి సిక్స్

## భారత సంతతి క్రికెటర్ హీరో

**ముంబై జూన్ 28 :** అమెరికాలో జరుగుతున్న మేజర్ లీగ్ క్రికెట్-2026లో భారత సంతతి క్రికెటర్ నిఖిల్ చౌదరీ హీరోగా నిలిచాడు. టెక్సాస్ సూపర్ కింగ్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో చివరి బంతికి సిక్స్ బాది వాషింగ్టన్ ఫ్రీడమ్‌కు ఒక వికెట్ తేడాతో అద్భుత విజయాన్ని అందించాడు. ముందుగా బ్యాటింగ్ చేసిన టెక్సాస్ సూపర్ కింగ్స్ 20 ఓవర్లలో నాలుగు వికెట్లకు 185 పరుగులు చేసింది. డొనోవన్ ఫెరీరా (44 నాటౌట్), వియాన్ ముల్డర్ (43 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడగా, సాయితేజ ముక్కామల్ల 37 పరుగులతో రాణించాడు. వాషింగ్టన్ బౌలర్లలో నిఖిల్ చౌదరీ రెండు వికెట్లు పడగొట్టాడు.

### చివరి బంతికి సిక్స్

186 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వాషింగ్టన్‌కు మిచెల్ ఓవెన్ (77), స్టీవ్ స్మిత్ (30) శుభారంభం అందించారు. అయితే వరుసగా వికెట్లు కోల్పోవడంతో మ్యాచ్ ఉత్కంఠభరితంగా మారింది. చివరి ఓవర్లో విజయానికి ఆరు పరుగులు అవసరమవగా, టెక్సాస్ బౌలర్ హెూసెన్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. తొలి బంతికి పరుగులివ్వకుండా, తర్వాతి మూడు బంతుల్లో హ్యాట్రిక్ వికెట్లు తీసి మ్యాచ్‌ను టెక్సాస్ వైపు తిప్పాడు. చివరి బంతికి ఐదు పరుగులు అవసరమైన పరిస్థితిలో నిఖిల్ చౌదరీ భారీ సిక్స్ బాది వాషింగ్టన్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న నిఖిల్ చౌదరీకి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

### ఎవరీ నిఖిల్ చౌదరీ?

నిఖిల్ చౌదరీ ఢిల్లీలో జన్మించగా, అతని కుటుంబ మూలాలు పంజాబ్‌కు చెందినవి. మొదట ఫాస్ట్ బౌలర్‌గా కెరీర్ ప్రారంభించిన అతడు తర్వాత ఆఫ్ స్పిన్నర్‌గా, అనంతరం లెగ్ స్పిన్నర్‌గా మారాడు. ఈ ఏడాది ఆస్ట్రేలియా జాతీయ జట్టుకు ఎంపికై బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్ ఆడాడు. అలాగే బిగ్‌బాష్ లీగ్‌లో ఆడిన రెండో భారత సంతతి క్రికెటర్‌గా కూడా నిఖిల్ రికార్డు సృష్టించాడు.



# నీయవ్వ తగ్గేదేలే..


### ఆస్ట్రేలియా అంటే బయపడుతామా?..

### మా సత్తా ఏంటో చూపిస్తాం!

భరత మహిళల జట్టు కీలక పోరుకు సిద్ధమైంది. మహిళల టీ20 ప్రపంచకప్ 2026లో సెమీఫైనల్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే ఆస్ట్రేలియాపై హర్మన్ సేన తప్పక గెలవాల్సి ఉంది. ఆదివారం (జూన్ 28) లండన్ వేదికగా జరిగే ఈ మ్యాచ్‌కు ముందు భారత వైస్ కెప్టెన్ స్మృతి మంధాన ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఆస్ట్రేలియా అంటే తాము బయపడమని, భారత్ సత్తా ఏంటో చూపిస్తాం అని పేర్కొంది. ఎలాంటి ఒత్తిడి ఉన్నా తాము దూకుడు ఆటనే కొనసాగిస్తామని, ఆస్ట్రేలియాపై కూడా అదే శైలిలో బరిలోకి దిగుతామని మంధాన స్పష్టం చేసింది. ఈ మ్యాచ్ భారత్‌కు 'దూ ఆర్ డై' కావడంతో అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. మ్యాచ్‌కు ముందు మీడియాతో మాట్లాడిన స్మృతి మంధాన.. ఈ టోర్నీలో భారత బ్యాటింగ్ యూనిట్ తమ పూర్తి సామర్థ్యాన్ని ఇంకా ప్రదర్శించలేదని అంగీకరించింది. బ్యాటింగ్ సమావేశాల్లో దూకుడుగా ఆడాలనే అంశంపైనే ఎక్కువగా చర్చిస్తున్నామని తెలిపింది. 'మొదటి బంతి నుంచే దూకుడుగా ఆడాలని మేమంతా భావిస్తున్నాం. కానీ ఇప్పటివరకు అనుకున్న స్థాయిలో అది సాధ్యపడలేదు. అయితే ప్రతి బ్యాటర్ పెద్ద ఇన్నింగ్స్ ఆడేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో మా అసలైన ఆటను చూపించాలనుకుంటున్నాం' అని మంధాన పేర్కొంది.

### ఆస్ట్రేలియాతో గ్యాప్ చాలా తగ్గింది:

గత నాలుగు నుంచి ఐదు సంవత్సరాల్లో భారత మహిళల జట్టు ఆస్ట్రేలియాతో పోటీపడే స్థాయికి చేరుకుందని స్మృతి తెలిపింది. మహిళల ప్రీమియర్ లీగ్, బిగ్ బాష్ లీగ్‌లలో భారత ఆటగాళ్లు ఆడటం వల్ల ఒత్తిడిని ఎదుర్కొనే సామర్థ్యం పెరిగిందని చెప్పింది. 'ఆస్ట్రేలియాలో జరిగిన టీ20 సిరీస్‌లో మేము మంచి ప్రదర్శన చేశాం. ఆ అనుభవం మాకు ఆత్మవిశ్వాసాన్ని ఇస్తోంది. గతంతో పోలిస్తే రెండు జట్ల మధ్య అంతరం చాలా తగ్గింది. విదేశీ లీగ్‌ల అనుభవం కూడా మాకు ఎంతో ఉపయోగపడుతోంది' అని వివరించింది.






# 'మా ఇంటి బంగారం'కు సీక్వెల్..

హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'మా ఇంటి బంగారం' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. కుటుంబ భావోద్వేగాలు, వినోదం, సమంత నటనకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించడంతో ఈ చిత్రం దాదాపు రూ.70 కోట్ల గ్రాస్ వసూళ్లకు చేరువైనట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. సినిమా విజయోత్సవ వేడుకలో నిర్మాత రాజ్ నిడిమోరు మాట్లాడుతూ, 'మా ఇంటి బంగారం'కు సీక్వెల్ రూపొందించనున్నట్లు ప్రకటించారు. రెండో భాగానికి సంబంధించిన కథా లైన్ ఇప్పటికే సిద్ధమైందని, త్వరలోనే ప్రాజెక్ట్‌ను ప్రారంభించే ఆలోచనలో ఉన్నామని తెలిపారు. మొదటి భాగం కంటే సీక్వెల్‌ను మరింత భారీ స్థాయిలో తెరకెక్కించాలని చిత్రబృందం భావిస్తున్నట్లు సమాచారం. అయితే ఇది కథకు కొనసాగింపుగా వస్తుందా? లేక ప్రధాన పాత్ర గతాన్ని ఆవిష్కరించే ప్రీక్వెల్‌గా రూపొందుతుందా? అనే అంశంపై సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఇదే సమయంలో సమంత కొంతకాలం విరామం తీసుకునే అవకాశం ఉందన్న ప్రచారం నేపథ్యంలో రెండో భాగంలో ఆమెనే కొనసాగిస్తారా? అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. మరోవైపు ఈ కథను తొలుత సాయిపల్లవిని దృష్టిలో పెట్టుకుని సిద్ధం చేసినట్లు నిర్మాత గతంలో వెల్లడించిన విషయం తెలిసిందే. దీంతో 'మా ఇంటి బంగారం-2'లో సాయిపల్లవి నటించే అవకాశాలపై కూడా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే సమంత కొనసాగుతారా? సాయిపల్లవి నటిస్తారా? లేక కొత్త పాత్రలు చేరనున్నాయా? అనే విషయాలపై చిత్రబృందం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

# వివాహంపై త్రిష

## ఆసక్తికర వ్యాఖ్యలు మళ్లీ వైరల్

నటి త్రిష కృష్ణన్ వివాహం, విడాకులపై గతంలో చేసిన వ్యాఖ్యలు మరోసారి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఇటీవల ఆమె వివాహంపై పుకార్లు చక్కర్లు కొడుతున్న నేపథ్యంలో పాత ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలను అభిమానులు మళ్లీ పంచుకుంటున్నారు. వివాహ బంధం తన దృష్టిలో ఎంతో పవిత్రమైనదని త్రిష అప్పట్లో పేర్కొన్నారు. జీవితంలో ఒక్కసారి మాత్రమే పెళ్లి చేసుకోవాలని, ఆ బంధం జీవితాంతం కొనసాగాలని తన నమ్మకమని చెప్పారు. కేవలం వయసు పెరుగుతోందనే కారణంతో లేదా సమాజం ఒత్తిడి వల్ల వివాహం చేసుకోవడం తనకు ఇష్టం లేదని స్పష్టం చేశారు. తన మనసుకు నచ్చిన వ్యక్తి దొరికితేనే వివాహం చేసుకుంటానని, అలాంటి వ్యక్తి దొరకకపోతే ఒంటరిగా జీవించడానికైనా సిద్ధమే కానీ, తర్వాత విడాకుల వరకు వెళ్లే నిర్ణయం తీసుకోనని తెలిపారు. గతంలో ఓ పారిశ్రామికవేత్తతో త్రిష నిశ్చితార్థం జరిగినప్పటికీ, వ్యక్తిగత కారణాలతో అది రద్దైంది. అనంతరం ఆమె పూర్తిగా సినీ కెరీర్‌పైనే దృష్టి సారించారు. ప్రస్తుతం ఆమె చేతిలో పలు భారీ చిత్రాలు ఉన్నాయి. ఇదే సమయంలో త్రిష త్వరలో వివాహం చేసుకోబోతున్నారంటూ వస్తున్న ప్రచారం కారణంగా ఆమె పాత వ్యాఖ్యలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. అయితే ఈ పుకార్లపై త్రిష నుంచి ఎలాంటి అధికారిక స్పందన వెలువడలేదు.





## శివరాజ్‌కుమార్‌తో నటించాలంటే

# భయమేసింది

నటి నభా నటేష్ తన సినీ ప్రయాణం, సహనటులతో కలిసి పనిచేసిన అనుభవాల గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ప్రస్తుతం 'నాగబంధం' సినిమా ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పలు విశేషాలు పంచుకున్నారు. కన్నడ సినీ పరిశ్రమలో తన కెరీర్ ప్రారంభమైందని గుర్తుచేసుకున్న నభా నటేష్, తొలి చిత్రంలోనే నటుడు శివరాజ్‌కుమార్‌తో నటించే అవకాశం రావడం ఆనందంగా అనిపించినప్పటికీ, ఆయన స్టార్ ఇమేజ్‌ను చూసి మొదట చాలా భయపడ్డానని తెలిపారు. ఆ సినిమాలో గుర్రంపై స్వారీ చేయడం, బీడీ తాగడం వంటి మాస్ లక్షణాలు ఉన్న పాత్రను పోషించానని, ఆ తరహా పాత్రను మళ్లీ చేయలేదని చెప్పారు. శివరాజ్‌కుమార్ సినిమాలు చూస్తూ పెరిగిన తనకు, ఆయనతో ఒకే తెరపై నటించడం మొదట్లో ఎంతో టెన్షన్ కలిగించిందని పేర్కొన్నారు. ప్రస్తుతం 'నాగబంధం'తో పాటు 'స్వయంభు' చిత్రాల్లో నటిస్తున్న నభా నటేష్, ఈ రెండు చిత్రాలు తన కెరీర్‌లో భిన్నమైన అనుభవాలను అందించాయని తెలిపారు. ముఖ్యంగా 'స్వయంభు'లో తన పాత్ర శక్తివంతంగా ఉంటుందని, ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే నమ్మకం వ్యక్తం చేశారు.

## 'లెనిన్' ట్రైలర్‌కు ముహూర్తం

# జూన్ 30న విడుదల



అక్కినేని అఖిల్ కథానాయకుడిగా నటిస్తున్న 'లెనిన్' సినిమా ప్రచార కార్యక్రమాలు జోరందుకున్నాయి. జూలై 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ చిత్రం ట్రైలర్‌ను జూన్ 30న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. గ్రామీణ నేపథ్యంలోని యాక్షన్, కుటుంబ భావోద్వేగాలతో దర్శకుడు మురళి కిషోర్ అబ్బురు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇందులో అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది. సంగీత దర్శకుడు ఎస్.ఎస్. థమన్ స్వరాలు సమకూరుస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం అఖిల్ కెరీర్‌లో అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందిన సినిమాగా నిలుస్తోంది. ట్రైలర్‌తో సినిమాపై మరింత ఆసక్తి పెరుగుతుందని చిత్రబృందం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.




Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com